# నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో నవోదయాల ఏర్పాటుకు స్థలాలు అందజేయండి

**ఆర్ఓబి నిర్మాణాల పెండింగ్ బిల్లులు మంజూరు చేయండి**

**జక్రాన్ పల్లి ఎయిర్ పోర్టు ఓఎల్ఎస్ సర్వే చేసి కేంద్రానికి నివేదించండి**


**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరిన ఎంపీ అర్వింద్**

**సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్, మహా :** ఇటీవల కేంద్ర కేబినెట్ జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలో నవోదయ పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నది. ఈ నేపథ్యంలో ఆదివారం జూబ్లీహిల్స్ లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ తో కలిసి ఈ రెండు జిల్లాల్లో నవోదయల ఏర్పాటుకు ఒక్కోచోట సుమారు 20 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం అందజేయాలని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా రెండు జిల్లాల్లో పలు ప్రతిపాదిత స్థలాలను సీఎంకు ఈ సందర్భంగా అర్వింద్ వివరించారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టులను ఎంపీ అర్వింద్ వివరిస్తూ, మాధవ్ నగర్ ఆర్ఓబి 50 50 పద్ధతిలో మంజూరు చేయడం జరిగిందని, అడివి మామిడిపల్లి ఆర్ఓబి పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో మంజూరైనప్పటికీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ నిధులను దారి మళ్ళించిందన్నారు. కాంట్రాక్టర్లు సకాలంలో బిల్లులు అందక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, దీనివల్ల పనుల్లో కొంత జాప్యం జరుగుతుందన్నారు. ఇవే కాకుండా ఇతర ఆర్వోబీల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉందని, కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేసి , పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చొరవ చూపాలని కోరారు. జిల్లాలో ప్రతిపాదిత జక్రాన్ పల్లి ఎయిర్ పోర్టు పనులకు సంబంధించి ఓఎల్ఎస్ సర్వే ని రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేసి కేంద్రానికి నివేదించాలని కోరారు. మరోవైపు జగిత్యాల పట్టణంలో కేంద్రీయ విద్యాలయం సైతం మంజూరయ్యే దశలో ఉందని, దీనికి కూడా స్థల అన్వేషణ చేయాలని సీఎంని కోరారు. జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ ఎంపీ అర్వింద్ తో కలిసి జగిత్యాల పట్టణానికి సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాల పై ముఖ్యమంత్రితో చర్చించారు. తమ విజ్ఞప్తుల పట్ల సీఎం రేవంత్ రెడ్డి గారు సానుకూలంగా స్పందించారని ఎంపీ అర్వింద్ ఒక ప్రకటన తో తెలిపారు.

# ఎమ్మెల్సీ రేసులో కంది శ్రీనివాసరెడ్డి



(మొదటిపేజీ తరువాయి)

పిసిసి చీఫ్ పదవి దక్కింది. దీంతో ఇపుడు ఆదిలాబాద్, హైదరాబాద్ జిల్లాలు కాంగ్రెస్ పార్టీకి సవాల్ గా మారాయి. ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని.. భవిష్యత్తుపై వ్యూహరచనతో పదవులు కట్టబెట్టే అవకాశముంది. గతంలో వచ్చినట్లే వచ్చి చేజారిన ఎమ్మెల్సీ ఈ దఫా అద్దంకి దయాకర్ కు ఖాయమన్న చర్చ ఉంది. ఆదిలాబాద్ నుండి కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్ ఛార్జి, అమ్మన్యూస్ నెట్ వర్క్ మీడియా సంస్థల అధిపతి కంది శ్రీనివాసరెడ్డికి ఇచ్చే అంశాన్ని అధిష్టానం పరిశీలిస్తోంది. గత ఏడాది కాలంలో నియోజకవర్గంలో చేరికల ద్వారా పార్టీని బలోపేతం చేయడంతో పాటు పార్టీ అవసరాలు, వ్యూహాల రీత్యా ఎమ్మెల్సీ దక్కే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలంటున్నాయి. అద్దంకి దయాకర్, కంది శ్రీనివాసరెడ్డిలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వీరవిధేయులుగా పేరుంది. మరోవైపు సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, టిపిసిసి మీడియా సెల్ ఛైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి తదితరులు ఎమ్మెల్సీని ఆశిస్తున్నారు. హైదరాబాద్ నుండి టిపిసిసి ప్రచారకమిటీ కన్వీనర్ మధుయాష్కీ గౌడ్, చరణ్ కౌశిక్ యాదవ్ , మహబూబ్ నగర్ నుండి జగదీశ్వర్ రావు తదితరులు ఆశిస్తున్నారు. అన్ని జిల్లాల్లో ఆశావహులు ఉన్నా, వచ్చే స్థానిక ఎన్నికల్లో పార్టీ బాధ్యత భుజాన వేసుకోవడం, బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో అసెంబ్లీకి పార్టీని సన్నద్ధం చేసే ముందుచూపుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నిర్ణయాలు తీసుకోనున్నారు. సంక్రాంతి తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ రానుండగా, ఈలోగా అధిష్టానం అంచనాకు వచ్చే వీలుంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి సిట్టింగ్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పేరును అధిష్టానం దాదాపు ఫైనల్ చేసింది.

### త్వరలో విస్తరణ

ప్రస్తుతం కేబినెట్ లో ఆరు ఖాళీలుండగా, మంత్రివర్గ విస్తరణపై కసరత్తు జరుగుతోంది. హైదరాబాద్ లో బీఆర్ఎస్ నుండి చేరిన నేతలకు పదవులు దక్కుతాయా.. కాంగ్రెస్ నేతలకు దక్కుతాయా అన్నది చూడాల్సి ఉంది. మరికొందరు ఎమ్మెల్యే కారుదిగి చేయందుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. నిజామాబాద్ నుండి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి ఇప్పటికే కేబినెట్ బెర్త్ ఖాయమన్న ప్రచారం ఉంది. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ ల మధ్య గట్టి పోటీ నెలకొంది. వీరిలో ఒకరికి ఛాన్స్ దక్కనుంది. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆశిస్తున్నారు. వీరిలో ఎవరికి దక్కుతుందో చూడాలి. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కూడా ఆశిస్తున్నారు. ఎస్టీ లంబాడా కోటాలో బాలునాయక్, రామచంద్రనాయక్ పోటీపడుతున్నారు. త్వరలో నాలుగు బెర్త్ లు భర్తీచేయడం ఖాయమన్న ప్రచారం జరుగుతోంది.



## ప్రపంచ నైపుణ్య రాజధానిగా భారత్

**కువైట్ ఫ్యూచర్ జర్నీలో భారత యువతదే ముఖ్యపాత్ర**

**ప్రధాని నరేంద్ర మోడీ**



**మహా:** కువైట్‌కు అవసరమైన మానవ వనరులు, నైపుణ్యాలు, సాంకేతికతను అందించడంలో భారత్ ముందంజలో ఉందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. కువైట్ భవిష్యత్ తరాలను తీర్చిదిద్దడంలో భారతీయ ఉపాధ్యాయుల పాత్ర కీలకంగా మారిందని తెలిపారు. భారత్ స్టార్టప్‌లు, కువైట్ అవసరాలకు అత్యాధునిక పరిష్కారాలను చూపించగలవని అన్నారు. కువైట్‌లో హాలా మోడీ పేరిట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాని మోడీ, తన కువైట్ పర్యటన రెండు దేశాల ప్రజల మధ్య స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. కువైట్ సమాజానికి భారతీయతను పరిచయం చేశారని ప్రవాస భారతీయులను కొనియాడారు. భారత్ నుంచి కువైట్‌కు చేరుకునేందుకు నాలుగు గంటల సమయం పడితే, ఒక భారత ప్రధాని కువైట్‌కు రావడానికి నాలుగు దశాబ్దాలు పట్టిందని మోదీ చెప్పారు.

**కువైట్ మినీ ఇండియా!**

పశ్చిమాసియా దేశమైన కువైట్‌లో ఇంత మంది భారతీయులను చూడటం చాలా ఆనందంగా ఉందని, ఇదో మినీ ఇండియాలా కనిపిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ఏటా వందలాది మంది భారతీయులు ఇక్కడికి వస్తున్నారని, అలా కువైట్ సమాజానికి భారతీయతను పరిచయం చేశారని మోదీ అన్నారు. భారతదేశ ప్రతిభ, సాంకేతికత, సంప్రదాయాలను మేళవించి కువైట్ నేలను భారతీయ నైపుణ్య రంగులతో నింపారని ప్రశంసించారు. భారతదేశ స్టార్టప్‌లు, సాంకేతికతలు కువైట్ అవసరాలకు ఆధునిక పరిష్కారాలను చూపించగలవని మోదీ అన్నారు. కొవిడ్ 19 మహమ్మారి సమయంలో భారత్‌కు లిక్విడ్ ఆక్సిజన్‌ను సరఫరా చేసిన కువైట్ ప్రభుత్వానికి ఈ సందర్భంగా మోదీ కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు రెండు రోజుల పర్యటన కోసం కువైట్ చేరుకున్న ప్రధాని మోదీకి ఘన స్వాగతం లభించింది. కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చిన ప్రవాస భారతీయులు ప్రధానికి స్వాగతం పలికారు. అందరినీ మోదీ ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా తాను ఇచ్చిన మాట ప్రకారం 101 ఏళ్ల మంగళ్ సేన్ హండా అనే మాజీ ఐఎఫ్ఎస్ అధికారిని కలిశారు. మంగళ్ సేన్ హండాను కలవాలంటూ ఎక్స్ వేదికగా ఆయన మనవరాలు చేసిన అభ్యర్థనను అంగీకరించిన మోదీ, కువైట్‌కు చేరుకున్న అనంతరం ఆయనతో ప్రత్యేకంగా కలిసి మాట్లాడారు.

# గిల్లుకున్నఅల్లు

**తప్పుమీద తప్పు చేసిన అర్జున్..వరుస తప్పులతోనే తీవ్ర వ్యతిరేకత**

**అన్నీ ఆయన స్వయంకృతాపరాధం.. బన్నీ తప్పులు.. పరిశ్రమకు తిప్పలు**

**మధ్యంతర బెయిల్ తో ఉన్న అల్లు అర్జున్ తో వరుస ప్రెస్ మీట్లు పెట్టించిందెవరు?**

**బన్నీ ప్రతిపక్షనాయకుడా? రాజకీయాలతో ఆయనకేం పని?**

**ఇప్పటికే మానవహక్కుల కమిషన్ కు ఫిర్యాదు..**

**జాతీయ అవార్డుకూడా రద్దుచేయాలని డిమాండ్లు**

**అల్లు అర్జున్ ఇంటిపై విద్యార్థినేతల దాడి.. ఉద్రిక్తత**







**హైదరాబాద్, మహా:** అల్లు అర్జున్ గిల్లుడుకి చిత్ర పరిశ్రమ షేకవుతోంది. పుష్ప సినిమా ప్రభావం నుండి బయటపడకుండా అల్లుఅర్జున్ చేసిన వరుస తప్పులే ఆయన వ్యక్తిత్వాన్ని డ్యామేజ్ చేయడంతో పాటు కెరీర్ నే ప్రమాదంలో పడేశాయి. ఇప్పటికీ అల్లుఅర్జున్ ఈ సమస్య నుండి బయటపడకుండా రాజకీయుల ఆటల్లో తాను పావుగా మారి తప్పులు చేస్తున్నాడు. బన్నీ తప్పులే పరిశ్రమకు తిప్పలుగా మారాయి. అల్లు అర్జున్ పెట్టిన ప్రెస్ మీట్లు తీవ్ర విమర్శలకు గురికాగా, ఆయన వివరణ తప్పని నిరూపిస్తూ పోలీసులు వీడియోలు విడుదల చేశారు. ముఖ్యమంత్రి ప్రెస్ మీట్ పెట్టగానే కౌంటర్ ప్రెస్ మీట్ పెట్టడానికి అల్లు అర్జున్ ప్రతిపక్షనాయకుడా అన్న విమర్శలొచ్చాయి. మధ్యంతర బెయిల్ లో ఉన్న రిమాండ్ ఖైదీ ప్రభుత్వాన్ని, పోలీసులను అగౌరవపరిచేలా సవాల్ చేసేలా ప్రెస్ మీట్లు పెట్టడమేంటని ప్రభుత్వవర్గాలు అగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై మరోసారు బిజెపి నేతలు విమర్శలు చేయగా, మంత్రి కోమటిరెడ్డితో పాటు పలువురు ఖండించారు. మరోవైపు అల్లు అర్జున్ ఇంటిపై విద్యార్థినేతలు దాడికి యత్నించగా, పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇక అల్లు అర్జున్ పుష్ప సినిమాకు జాతీయ ఉత్తమనటుడి అవార్డు రాగా, దానిని కేంద్రం రద్దుచేయాలని మరికొందరు కోరుతున్నారు. కేంద్రమంత్రి బండిసంజయ్ తో పాటు తెలుగురాష్ట్రాల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు దీనిపై స్పందించారు.

### అసలేం జరిగింది..

ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగింది. ఈ ఘటన తర్వాత అల్లు అర్జున్ చేసిన కొన్ని పనులు చాలా మందికి నచ్చలేదు. అసహనానికి గురయ్యేలా చేశాయి. అది ఆయన వ్యక్తిత్వం, అనాలోచిత నిర్ణయాలే అని చెబుతున్నారు. దాని వల్లే ఇన్ని విమర్శలు ఎదుర్కోవాల్సివస్తోంది. చనిపోయిన మహిళ గురించి ప్రెస్‌మీట్ పెట్టినప్పుడు, పుష్ప బ్రాండ్ ప్రమోషన్ షర్ట్ వేసుకుని రావడం పలు విమర్శలకు దారి తీసింది. పోలీసులు ఆయన ఇంటికి వచ్చినప్పుడు, కాఫీ తాగుతూ అహంకారంతో ప్రవర్తించడం కూడా ప్రజలకు నచ్చలేదు. కోర్టులో ఆయన తరఫు లాయర్ చేసిన వ్యాఖ్యలు, ‘‘పోలీసులు కూడా హీరోను చూడడానికి బాల్కనీలో ఉన్నారు’’ అనే మాటలు అసహ్యకరంగా ఉండటమే కాకుండా, బాధితులకు అవమానం కలిగించాయి. బెయిలు వచ్చిన తర్వాత ఇంట్లో ఉండకుండా, బయట లాన్‌లో బల ప్రదర్శన చేయడం ఆయన మీద నెగటివ్ ప్రచారాన్ని తెచ్చింది. రాజకీయ నేతలు కూడా ఈ ఘటనను ఉపయోగించుకుని, ఆయనపై మరిన్ని విమర్శలు చేశారు. ముఖ్యంగా, కేటీఆర్ ట్వీట్ , అల్లు అర్జున్ ను అడ్డంపెట్టుకుని ముఖ్యమంత్రిని అవమానించేలా చేసిన తీవ్ర రాజకీయ వర్గాల విమర్శలు ఈ ఇష్యూని మరింత ముదిరేలా చేశాయి.

### అల్లు అరవింద్ కూడా..

ఇంత జరిగినా, అల్లు అర్జున్ కుటుంబ సభ్యులు చేసిన వ్యాఖ్యలు, ముఖ్యంగా ‘‘మా అబ్బాయి సినిమాను ఎంజాయ్ చేయలేకపోతున్నాడు’’ అని అల్లు అరవింద్ చేసిన వ్యాఖ్యలు మరింత నెగటివిటీ పెంచాయి. ఈ ఘటన అల్లు అర్జున్ పబ్లిక్ ఇమేజ్ మీద తీవ్రమైన ప్రభావాన్ని చూపించింది. ప్రజెంట్ సోషల్ మీడియా చిన్న విషయాన్ని కూడా క్షణాల్లో పెద్దదిగా చూపిస్తుంది. ఇలాంటి తరుణంలో ఇన్ని తప్పులు పైకి కనిపించడం తో చిన్న చిన్న చర్యలు సరిపోవు అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ అనుభవాలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలియజేస్తున్నాయి. ముందుగా దీనిని రాజకీయం చేయవద్దని అప్పీల్ చేయడంతో పాటు అభిమానులను కూడా కట్టడి చేయాలి. మీడియా ముందుకు రావడం మాని పరిశ్రమ పెద్దలు మెగాస్టార్ లేదా దిల్ రాజు ద్వారా ప్రభుత్వంతో వివాదం కోరుకోవడం లేదన్న అంశాన్ని ఆచరణ ద్వారా చూపాల్సిన అవసరం ఉంది. లేకుంటే పుష్ప బెయిల్ రద్దు విజ్ఞప్తి నుండి ఇంకా అనేక అంశాలు అల్లు అర్జున్ ను చిక్కుల్లో పడేసే అవకాశముంది. ఇప్పటికే తన వ్యక్తిగత ప్రవర్తనతో కెరీర్ ప్రమాదంలో పడగా, జాగ్రత్తలుతు తీసుకోవాల్సి ఉంది.

### పోలీసులు చెప్పినా..

అభిమానులు ఉధృతిని తగ్గించడానికి బన్నీని పోలీసులు వెళ్ళిపోమని వారించినా ఆయన అక్కడే ఉండటం ఇప్పుడు పెద్ద తప్పుగా కనిపిస్తుంది. చివరికి డీసీపీ బలవంతంగా తరలించాల్సిన పరిస్థితి వచ్చింది. దీని గురించి అల్లు అర్జున్ “నాకు విషయం తెలియదు” అని ఇచ్చిన వివరణ చాలా మందిని అసంతృప్తి పర్చింది. ఈ ఉదంతంలో అనేక పొరపాట్లు ఉన్నాయి. ప్రెస్‌మీట్‌లో చేసిన వ్యాఖ్యలు పోలీసుల పట్ల ప్రవర్తన, కోర్టులో లాయర్ చేసిన జోకులు బహిరంగంగా ఇంటి ఆవరణ లో బల ప్రదర్శన చేయడం కూడా సమస్యను మరింత పెంచింది. రాజకీయ నాయకులు విమర్శలు మరియు సోషల్ మీడియాలో వచ్చిన కామెంట్స్, ఈ వ్యవహారాన్ని మరింత దుష్ప్రచారానికి గురిచేశాయి. అంతే కాకుండా పోలీస్ సూచనలు పాటించకుండా, థియేటర్ దగ్గర క్రౌడ్, జనాల భద్రత ఆలోచించకపోవడం అనాలోచిత చర్యగా విమర్శలకు గురైంది. పోలీస్‌ల రిక్వెస్ట్‌ను పట్టించుకోకుండా రాత్రి 12 గంటల వరకు అక్కడే ఉండడం, ఆ తర్వాత బలవంతంగా తరలించాల్సిన పరిస్థితి రావడం ప్రజల్లో వ్యతిరేకత కలిగించింది.

# 100 ఏళ్ళు పూర్తి చేసుకున్న మెదక్ చర్చి



(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమాలను తిలకించారు. అనంతరం యేసు క్రీస్తు, చర్చిని ఉద్దేశించి ప్రసంగించారు. ఆ తర్వాత అక్కడి నుంచి కొల్చారం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు చేరుకున్నారు. గవర్నర్‌కు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఘనస్వాగతం పలికారు. పాఠశాలకు చేరుకున్న జిష్ణుదేవ్ వర్మ అక్కడ విద్యార్థులను కలిసి ముచ్చటించారు. ఆహారం, వసతి సహా పలు అంశాలపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి గవర్నర్ భోజనం చేశారు.

ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా మెదక్ చర్చిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. చర్చి వందేళ్లు పూర్తి చేసుకోవడం చాలా గొప్ప విషయమని, యేసుక్రీస్తు ప్రేమను ఈ చర్చి వందేళ్లుగా పంచుతోందన్నారు. జీసస్ ఏ విధంగా మనల్ని ప్రేమిస్తాడో, అదే విధంగా మనం ఇతరులను ప్రేమించాలని గవర్నర్ పేర్కొన్నరు. బాలికలకు రెసిడెన్షియల్ స్కూల్స్ బంగారు భవిష్యత్ ఇవ్వాలని మనసారా కోరుతున్నానని, మంచి సంస్కృతి, సంప్రదాయాలతో విద్యార్థులు సమాజంలో ఎదగాలని గవర్నర్ ఆకాంక్షించారు. కలలు సాకారం చేసుకునేందుకు నిరంతరం శ్రమించాలంటూ, క్రీడలలో బ్యాడ్మింటన్ క్రీడ అంటే నాకు చాలా ఇష్టమన్నారు. నాకు భారత మాజీ ఉప రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శమని, దేశ భవిష్యత్తుకు మీరు పునాదిలాంటి వారన్నారు. సమస్యలను అధిగమిస్తూ లక్ష్యాలను సాధించాలని, విద్యాలయాలు దేవాలయాలతో సమానమని, విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో మెలుగుతూ అభివృద్ధిలోకి రావాలన్నారు. మంచి ప్రవర్తనతో చిన్నారులు భవిష్యత్‌కు మార్గనిర్దేశం చేసుకోవాలని చెప్పారు.

### 25న రానున్న సీఎం రేవంత్ రెడ్డి

కాగా, మెదక్ చర్చి శతాబ్ది ఉత్సవాల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. ఈనెల 25న క్రిస్మస్ సందర్భంగా జరిగే వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. ఆదివారం నుంచే వందేళ్ల పండగ ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఇప్పటికే వివిధ ప్రాంతాల నుంచి చర్చికి పెద్దఎత్తున భక్తులు తరలి వస్తున్నారు. సోమవారం చర్చి ఆవరణలో ప్రత్యేక కృతజ్ఞత కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో జీసస్ జన్మ వృత్తాంతాన్ని తెలిపే నాటక ప్రదర్శనలు, ప్రత్యేక ప్రార్థనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

# అల్లు అర్జున్ తీస్‌మార్ ఖాన్ అనుకుంటున్నాడా?

**ఏసీపీ పబ్బతి విష్ణుమూర్తి**




**హైదరాబాద్, మహా :** రేవంత్ రెడ్డి శాసనసభలో చేసిన ప్రకటనపై అల్లు అర్జున్ ప్రెస్ మీట్ పెట్టడం ప్రాధాన్యతను సంతరించుకుంది. అనుమతి లేకుండా, బాధ్యతారహితంగా సంధ్యా థియేటర్‌కు వెళ్లాననడం సరికాదని, అది తప్పుడు సమాచారమని అల్లు అర్జున్ అన్నారు. ఇదొక యాక్సిడెంట్ మాత్రమేనని, ఇందులో ఎవరి తప్పులేదని చెప్పారు. సంధ్య థియేటర్ వద్ద రోడ్ షో చేయలేదని, పోలీసుల డైరెక్షన్‌లోనే థియేటర్‌కు వెళ్లాననీ అన్నారు. ఈ వ్యాఖ్యలపై ఏసీపీ విష్ణుమూర్తి ఘాటుగా స్పందించారు. బెయిల్‌పై ఉన్న వ్యక్తి ప్రెస్‌మీట్ పెట్టి ఎలా మాట్లాడుతారన్నారు. తన తప్పేమీ లేదని ఎలా చెప్పగలడని ప్రశ్నించారు. పోలీసుల డైరెక్షన్‌లోనే వెళ్లాననడం సరికాదని, తమను బాధ్యులుగా చేస్తున్నట్లు కనిపిస్తోందని మండిపడ్డారు. ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అల్లు అర్జున్ పాలు తాగే పిల్లాడేం కాదని, తప్పొప్పులు ఏమిటో చట్టం, రాజ్యాంగ పరిధి ఏమిటో అతనికి బాగా తెలుసుననే అనుకుంటున్నానని అన్నారు. దాని పరిధిని దాటి మాట్లాడకూడదని విష్ణుమూర్తి హితవు పలికారు.

# 2025

## జనవరి నుండి సరికొత్తగా

## Mahaaaaaah

# మహా పత్రిక

**దమ్మున్న వార్తల వేదిక**

రంగు పూసుకున్న పత్రిక కాదు.. రాజీలేని పత్రిక

FOLLOW: @MAHAADAILY



# AMMA NEWS NETWORK

EDITORIAL ఎడిటోరియల్

# భారత్‌తో గల్ఫ్ దేశాల బంధం

భారత్ తో గల్ఫ్ దేశాల బంధం మెరుగుపడుతోంది. నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భారత్‌తో గల్ఫ్ దేశాల సంబంధాలు మరింత బలపడ్డాయి. ఈ దేశాల నుంచి భారత్‌కు వస్తున్న పెట్టుబడులే ఇందుకు తాజా ఉదాహరణ. వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఇటీవల విడుదల చేసిన డేటా ప్రకారం, గత 10 సంవత్సరాలలో పెట్టుబడి 8 రెట్లు పెరిగింది. గల్ఫ్ సహకార మండలి దేశాల నుండి భారతదేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు సెప్టెంబర్ 2013 నుంచి సెప్టెంబర్ 2024 మధ్య 24.54 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఏప్రిల్ 2000 నుంచి సెప్టెంబర్ 2013 మధ్య ఈ దేశాల నుండి 3.046 బిలియన్ డాలర్లతో పోలిస్తే, 8 రెట్లు పెరుగుదల నమోదు చేసుకుంది. గల్ఫ్ కోఆపరేటివ్ కౌన్సిల్ జిసిసి దేశాల నుండి భారతదేశానికి వస్తున్న ఎఫ్ డిఐ 89 శాతం గత 10 సంవత్సరాలలో వచ్చాయని గణాంకాలు చెబుతున్నాయి. ఇది భారతదేశం - గల్ఫ్ ప్రాంతం మధ్య బలపడుతున్న ఆర్థిక సంబంధాలకు నిదర్శనంగా నిలుస్తోంది. ప్రస్తుతం కువైట్ గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ కి అధ్యక్షత వహిస్తోంది. కాబట్టి ప్రధాని నరేంద్ర మోదీ ఎమిరేట్స్ పర్యటన బహ్రెయిన్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యుఎఇ, కువైట్ ల తో భారత్ సత్సంబంధాలు కొనసాగిస్తోంది. ప్రధాని మోడీ 43 ఏళ్ల తర్వాత గల్ఫ్‌లో పర్యటించిన తొలి భారత ప్రధానిగా రికార్డు సృష్టించారు. కువైట్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ భారత్‌లో 10 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టిందని, దీంతో ఇరు దేశాల మధ్య ఆర్థిక సంబంధాలు మరింత బలపడిందని ఈ సందర్భంగా ప్రధాని మోడీ చెప్పారు. సావరిన్ వెల్త్ ఫండ్ అయిన కువైట్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ భారతదేశంలో గణనీయమైన పెట్టుబడులు పెట్టిందని, ఇప్పుడు భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి పెరుగుతోందని ప్రధాని మోదీ ప్రస్తావించారు. కువైట్ - భారత్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు వర్తక, వాణిజ్యం ముఖ్యమైన స్తంభాలుగా ఉన్నాయని, రెండు దేశాల మధ్య వాణిజ్యం వృద్ధి చెందుతుందని ప్రధాని మోదీ అన్నారు. వర్తక, వాణిజ్యం మన ద్వైపాక్షిక సంబంధాలకు ముఖ్యమైన స్తంభాలుగా ఉన్నాయని ప్రధాన మంత్రి అన్నారు. మన ద్వైపాక్షిక వాణిజ్యం పెరుగుతోంది. భారత్ శక్తి భాగస్వామ్యం ద్వైపాక్షిక వాణిజ్యానికి ప్రత్యేక విలువను ఇస్తున్నట్లు తెలిపారు. కువైట్ ను మినీ ఇండియా గా ప్రకటించారు. కువైట్ భారతదేశానికి ముఖ్యమైన భాగస్వామి, ముడి చమురు సరఫరాలో ఆరవ అతిపెద్ద దేశంగా ఉంది. భారతదేశ ఇంధన అవసరాలలో 3 శాతం తీరుస్తుంది. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 202324లో 10.47 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా. భారతీయ ఎగుమతులు సంవత్సరానికి 34.7 శాతం పెరిగాయి. కువైట్‌లో ఆటోమొబైల్, ఎలక్ట్రికల్, మెకానికల్ మెషినరీ, టెలికమ్యూనికేషన్ రంగాలలో మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తులు కొత్త మార్కెట్ క్రియేట్ చేస్తున్నందుకు సంతోషంగా ఉన్నామని ప్రధాని మోడీ తన పర్యటనలో అన్నారు. భారతదేశం ప్రపంచ స్థాయి ఉత్పత్తులను అతి తక్కువ ధరతో తయారు చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని పెంపొందించడానికి చమురుయేతర వాణిజ్యాన్ని వైవిధ్యపరచడం కీలకమని మోడీ స్పష్టం చేశారు. ప్రపంచ నైపుణ్య రాజధానిగా భారత్ ఉందని స్పష్టం చేశారు.




# నోస్ట్రాడమస్ జోస్యం 2025

## సంచలనాలు.. అనూహ్య వైపరీత్యాలు

**సంచలనాలకు మారుపేరుగా కొత్త సంవత్సరం నిలవబోతుందా? వచ్చే ఏడాది అంతా హ్యాపీయేనా? కొత్త వైపరీత్యాలు దూసుకొస్తాయా? న్యూ ఇయర్ ఎలా ఉండబోతుంది? 2025పై ప్రపంచం ముందున్న అంచనాలేంటి?**

**: మహా ప్రత్యేకం**



నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని వచ్చే ఏడాది తమకు మంచి జరగాలని అందరూ కోరుకుంటారు. 16వ శతాబ్దానికి చెందిన ఫ్రెంచ్ ఖగోళ శాస్త్రవేత్త దర్శకుడు, ప్రసిద్ధ జ్యోతిష్కుడు నోస్ట్రాడమస్ ఓ సంచలనం. ఆయన చెప్పిన అంచనాలు చాలావరకు నిజమయ్యాయి. 2025 అంచనాలు ఈ ప్రపంచంలో ఎన్నో సంచలనాలు ముప్పును పేర్కొంటున్నాయి. ఇవి నిజమా కాదో తెలియదు కానీ ప్రపంచవ్యాప్తంగా వీటిపై చర్చ జరుగుతోంది. నోస్ట్రాడమస్ 1555 సంవత్సరంలో ఒక పుస్తకాన్ని రాశాడు. అందులో ఆయన భవిష్యత్తులో ఏం జరగబోతోందో బ్రహ్మంగారి తరహాలో చెప్పాడు. తన పుస్తకంలో 2025 సంవత్సరానికి సంబంధించి కొన్ని అంచనాలు కూడా ప్రస్తావించాడు. నోస్ట్రాడమస్ అని పిలిచే మిచెల్ డి నోస్ట్రేడామ్.. ప్రవచనాలకు ప్రసిద్ధి చెందాడు.

### నోస్ట్రాడమస్ టాప్ 10 అంచనాలు ఇవీ

- ఇంగ్లండ్‌లో క్రూరమైన యుద్ధాలు "పురాతన ప్లేగు" మళ్లీ విజృంభించే ప్రమాదం ఉంది. ఆయన అంచనా ప్రకారం.. శత్రువు కన్నా వినాశకరమైనది.
- 2025లో ఒక భారీ గ్రహశకలం భూమిని ఢీకొంటుందని లేదా ప్రమాదకరంగా దగ్గరగా వచ్చి మానవాళికి ప్రమాదం కలిగిస్తుంది
- ప్రపంచ రాజకీయాల్లో గణనీయమైన మార్పు జరుగుతుంది. స్థాపించిన పాశ్చాత్య దేశాల ప్రభావంలో తగ్గుదల, కొత్త ప్రపంచ శక్తుల ఆవిర్భావం ఈ మార్పును కలిగి ఉంటుంది.
- ప్రపంచవ్యాప్తంగా హరికేన్లు, సునామీలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తాయి. భౌగోళిక అస్థిరత, సౌర కార్య కలాపాలు, వాతావరణ మార్పుల సంగమం ఈ విపత్తులకు దారి తీస్తుంది.
- బంగారం లేదా వెండికి బదులుగా "కాయిన్ లెదర్" విలువ ఎక్కువగా పెరుగుతుంది. దీని కారణంగా ఆర్థిక అస్థిరత, ఆర్థిక విపత్తు లేదా కరెన్సీ విలువలో పెనుమార్పును సూచిస్తాయి.
- 21వ శతాబ్దం వైద్య సాంకేతికతలో గణనీయమైన అభివృద్ధిని చూస్తుంది. అనారోగ్యం నివారణ, చికిత్సలో గణనీయమైన మెరుగుదల కనిపించనుంది.
- కొత్త ప్రపంచ కరెన్సీ కనిపిస్తుంది. ఇది సాంప్రదాయ జాతీయ కరెన్సీల నిష్క్రమణను సూచిస్తుంది. ప్రపంచ వాణిజ్యం, వ్యాపారానికి మద్దతుగా ఈ కొత్త కరెన్సీ చక్రం తిప్పనుంది.
- అంతరిక్ష సాంకేతికతలో గణనీయమైన పురోగతి, కొత్త గ్రహాలు, ఖగోళ వస్తువుల ఆవిష్కరణగా ఈ కాలాన్ని పేర్కొనవచ్చు.
- గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై భారీ సైబర్ అటాక్ జరుగుతుంది. అంతర్జాతీయ వాణిజ్యం, కమ్యూనికేషన్, భద్రతపై ఈ సైబర్ దాడి ప్రభావం తీవ్రంగా ఉంటుంది.
- వినాశకరమైన వరదల మధ్య ఒక సామ్రాజ్యం ఉద్భవించి అదే "జల సామ్రాజ్యం". వాతావరణ సంబంధిత విపత్తుల ఫలితంగా ఒక కొత్త శక్తి ఆవిర్భావంగా పరిగణించవచ్చు.

# ధనుర్మాసం..

## శ్రీ మహా విష్ణు దేవుడికి ప్రీతికరం



సాధారణంగా మనకు ఉన్న తెలుగు నెలల్లో శివ, కేశవులకు కొన్ని మాసాలు అత్యంత ప్రీతీకరమైనవని చెప్తుంటారు. అందులో శ్రావణం, కార్తీక మాసం, మార్గశిర మాసం, ధనుర్మాసాలు ఆ దేవుడికి ఎంతో ప్రీతీకరమైనవని చెప్తుంటారు. అయితే.. ఈ కాలంలో చేసే పూజలు, వ్రతాలు కూడా అనేక రెట్లు గొప్ప ఫలితాలను ఇస్తాయంట. అయితే.. ప్రస్తుతం ధనుర్మాసం నడుస్తుంది. సూర్య భగవానుడు.. ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే మధ్య సమయంమే ధనుర్మాసంగా చెప్తుంటారు..అయితే.. ఈ కాలంలో విష్ణుదేవుడ్ని ఆరాధిస్తుంటారు. అయితే.. ఈ సమయంలో మాత్రం పెళ్లిళ్లను అస్సలు నిర్వహించరు. నెల రోజులపాటు తిరుప్పావై ఉత్సవాలను నిర్వహిస్తారు. శ్రీ మహావిష్ణు ప్రీతికోరకు పాశురాలు చదువుతుంటారు. అదేవిధంగా.. ఆండాళమ్మను ప్రత్యేకంగా కొలుస్తారు. ఈ మాసంలో పెళ్లిళ్ళు చేయకపోవడానికి శాస్త్రపరమైన, భౌతికపరమైన కారణం కూడా ఉందని తెలుస్తోంది. వాతావరణంలో అనేక మార్పుల కారణంగా ఆరోగ్యంపై ఎక్కువగా ప్రభావం చూపుతుంది. ఈ సమయంలో విపరీతంగా చలి ఉంటుందంట. అందుకే ఆహారం తీసుకోవడంలో కూడా అనేక మార్పులు వస్తాయంట. అందుకే.. ఈ కాలంలో శుభకార్యాలను నిర్వహించరని చెప్తుంటారు. ఏడాది పాటు ఆదేవుడ్ని కోలిచే సమయంలేని వారు.. కనీసం ఏడాది చివరన.. ఈ మాసంలో ఆ దేవుడ్ని కోలుచుకుంటారని కూడా.. ఈ మాసంలో పెళ్లిళ్లు నిర్వహించరని చెప్తుంటారు. అందుకే ధనుర్మాసంను శూన్య మాసం అంటారు. అదే విధంగా..ఈ మాసంలో కేవలం విష్ణుమూర్తిని ఆరాధిస్తు..ఆండళ్ అమ్మవారిని పాశురాలతో అర్చిస్తే.. వారిజీవితంలో అనేక ఉన్నత స్థానాలకు ఎదుగుతారని కూడా చేప్తుంటారు. అందుకే శ్రీ మహా విష్ణు ప్రీతీకొరకు విష్ణు సహస్రనామా పారాయణ, పూజలు, సత్యానారాయణ వ్రతాలు చేస్తే వందరేట్లు మంచి ఫలితాలు కల్గుతాయని కూడా పండితులు చెప్తుంటారు. ధనుర్మాసంలో గోదాదేవిని కూడా చాలా మంది పూజిస్తుంటారు. ముఖ్యంగా పెళ్లి కానీ వారు.. ఈ మాసంలో గోదా పారాయణం చేస్తే వెంటనే పెళ్లి అవుతుదంట.

- ఎస్

# చలికాలంలో వచ్చే కీళ్ల నొప్పులకు ఇలా చెక్ పెట్టండి..!

**చలికాలంలో సహజంగానే రక్త ప్రసరణ సరిగ్గా జరగదు. దీంతో కీళ్లు పట్టుకుపోయి దృఢంగా మారుతాయి. అయితే కొందరికి నొప్పులు కూడా ఉంటాయి. అలాగే ఆర్థరైటిస్ సమస్యతో బాధపడేవారికి చలికాలంలో ఇంకా నొప్పులు ఎక్కువగా ఉంటాయి. ఆయా భాగాల్లో వాపులు కూడా వస్తాయి. దీంతో చాలా ఇబ్బంది పడుతుంటారు. అయితే కొన్ని రకాల సూచనలు, ఆరోగ్య చిట్కాలను పాటిస్తే చలికాలంలో వచ్చే ఈ నొప్పుల నుంచి ఉపశమనం పొందవచ్చు. చలికాలంలో చాలా మంది ఎదుర్కొనే ఆర్థరైటిస్ నొప్పులతోపాటు ఇతర నొప్పులు కూడా తగ్గిపోవాలంటే అందుకు జీవన విధానంలో పలు మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో ఈ నొప్పులకు ఈ సీజన్‌లో చెక్ పెట్టవచ్చు. అందుకు ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.**


చలికాలంలో పగటిపూట కూడా చల్లగానే ఉంటుంది. అందుకని శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులను ధరించాలి. సాధ్యమైనంత వరకు రోజంతా ఉన్ని దుస్తులను ధరిస్తే మంచిది. శరీరాన్ని నిరంతరం వెచ్చగా ఉంచుకునే ప్రయత్నం చేయాలి. దీంతో శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుంది. ఫలితంగా కీళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే కాళ్లను వెచ్చగా ఉంచేందుకు గాను సాక్సులను ధరిస్తే మంచిది. దీంతో రక్త ప్రసరణ పెరిగి నొప్పుల నుంచి ఉపశమనం పొందవచ్చు. అదేవిధంగా నొప్పులు ఉన్నవారు ఈ సీజన్‌లో ఎట్టి పరిస్థితిలోనూ చన్నీటి స్నానం చేయకూడదు. దీని వల్ల నొప్పులు మరింత పెరిగే అవకాశం ఉంటుంది. కనుక వేడి నీటి స్నానం చేయాలి. దీంతో రక్త సరఫరా మెరుగు పడుతుంది. ఇది నొప్పులను తగ్గిస్తుంది.

### తేలికపాటి వ్యాయామం చేయాలి..

చలికాలంలో ఉదయం చాలా చల్లగా ఉంటుంది కనుక ఉదయం నిద్ర లేచి వ్యాయామం చేసేందుకు చాలా మంది బద్ధకంగా ఉంటారు. కానీ ఉదయం వ్యాయామం చేయడం వల్ల శరీరంలో వేడి పెరుగుతుంది. ఇది కీళ్లను ఆరోగ్యంగా ఉంచుతుంది. రక్త సరఫరాను పెంచుతుంది. తేలికపాటి నడక లేదా యోగా, స్విమ్మింగ్ వంటివి చేయడం వల్ల కీళ్లు సాగే గుణాన్ని పొందుతాయి. దీంతో కీళ్లు దృఢంగా మారకుండా ఉంటాయి. ఫలితంగా నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. చలికాలంలో వాతావరణం చల్లగా ఉంటుంది కనుక శరీరంలో ఎక్కడైనా నొప్పి ఉంటే అది తగ్గేందుకు కాపడం పెట్టవచ్చు. హాట్ ప్యాక్ లను వాడి కాపడం పెడితే నొప్పుల నుంచి సత్వరమే ఉపశమనం లభిస్తుంది.

### విటమిన్ డి కూడా ముఖ్యమే..

కొందరు చలికాలంలో జిమ్ లేదా వ్యాయామం ఎక్కువగా చేస్తుంటారు. ఎక్కువగా శారీరక శ్రమ చేస్తే ఎక్కువ ఫలితం ఉంటుందని అలా చేస్తుంటారు. కానీ చలికాలంలో అలా చేయడం ప్రమాదకరం. అది గుండె పోటు వచ్చేందుకు దారి తీయవచ్చు. పైగా కీళ్లపై కూడా భారం పడుతుంది. దీంతో కీళ్లు వాపులు, నొప్పులకు గురవుతాయి. కనుక అతిగా వ్యాయామం లేదా శారీరక శ్రమ చేయకూడదు. అలాగే చలికాలంలో మనకు విటమిన్ డి లభించడం కష్టతరమవుతుంది. కనుక డాక్టర్ సలహా మేరకు విటమిన్ డి సప్లిమెంట్లను తీసుకోవాలి. అలాగే విటమిన్ డి ఉండే ఆహారాలను కూడా తీసుకోవాలి. ఇది శరీరంలో క్యాల్షియం శోషణను ప్రేరేపిస్తుంది. దీంతో ఎముకలు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. కీళ్ల నొప్పులు తగ్గుతాయి. ఇలా పలు సూచనలు, చిట్కాలు పాటించడం వల్ల చలికాలంలో వచ్చే నొప్పులకు చెక్ పెట్టవచ్చు.



## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
editor@mahaadaily.com | whatsapp- 7436939999

## సినిమా ప్రమోషన్ కాదు..

# పౌరుల భద్రతే మాకు ముఖ్యం

### అల్లు అర్జున్‌కు మేం వ్యతిరేకం కాదు.. చట్టప్రకారమే చర్యలు.. డీజీపీ జితేందర్

**కరీంనగర్, మహా :** పోలీసులు ఏ వర్గానికి వ్యతిరేకం కాదని, పౌరుల భద్రత తమకు ముఖ్యమని రాష్ట్ర డీజీపీ డా. జితేందర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో కొత్తగా నిర్మించిన భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సంధ్య థియేటర్ ఘటనపై డీజీపీ స్పందించారు. తాము ఏ వర్గానికి వ్యతిరేకం కాదని, అల్లు అర్జున్ సినీ హీరో అయినా క్షేత్రస్థాయిలో పరిస్థితులను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమాజంలో శాంతిభద్రతలు ఫరిఢవిల్లాలంటే పౌరులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆయన గుర్తు చేశారు. సినీ ప్రమోషన్ కంటే పౌరుల భద్రత, రక్షణే తమకు ప్రాధాన్యత అని డీజీపీ స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు జరగటం సమాజానికి ఏమాత్రం మంచిది కాదని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం స్త్రీ, పిల్లల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యమిస్తుందని, అందువల్లే ప్రతి జిల్లా కేంద్రంలో భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో 20 ఎస్పీ కార్యాలయాలు, మరో 9 కమిషనరేట్లు ఉన్నాయని, ఇప్పటి వరకు 27 భరోసా కేంద్రాలను ప్రారంభించినట్లు డీజీపీ చెప్పారు. కరీంనగర్‌లో భరోసా కేంద్రాన్ని నిర్మించేందుకు ఎస్‌బీఐ సీఎస్ఆర్ నిధులను వెచ్చించామన్నారు. దాదాపు 6,800 చదరపు అడుగుల భవనాన్ని నిర్మించిందని వివరించారు.



#### మోహన్‌బాబు విషయంలో చట్టప్రకారం చర్యలు

అంతకుముందు ఐజీ రమా రాజేశ్వరితో కలిసి డీజీపీ భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. పౌరులు భరోసా కేంద్ర సేవలను వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్రంలో నక్సలిజం లేదని తాము భావించడం లేదన్నారు. ఇక్కడి వారు పొరుగు రాష్ట్రాల్లో నాయకత్వం వహిస్తున్నారని తెలిపారు. సినీ నటుడు మోహన్‌బాబు విషయంలో చట్ట ప్రకారం నడుచుకుంటామని డీజీపీ జితేందర్ స్పష్టం చేశారు

# ఇక నుండి ఊరుకోం



**హైదరాబాద్ , మహా:** సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనపై హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తొక్కిసలాట ఘటనకు సంబంధించిన పూర్వాపరాలను ఆయన వివరించారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్ద సంధ్య థియేటర్ పుష్ప 2 బెనిఫిట్ షో సందర్భంగా తొక్కిసలాట గురించి చర్చించారు. అనంతరం హీరో అల్లు అర్జున్ కూడా మీడియా సమావేశం ఏర్పాటు చేసి తనపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని వాపోయారు. ఈ క్రమంలో హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి, తొక్కిసలాటకు సంబంధించి పుర్వాపరాలను వివరించారు. ఈ మేరకు పూర్తి వీడియో విడుదల చేశారు.

**సినిమా చూశాకే వెళ్తానన్నారు**

ఈ ఘటనపై చిక్కడపల్లి ఏసీపీ రమేశ్ కుమార్ మాట్లాడారు. ఆరోజు జరిగిన విషయాన్ని మీడియాకు వివరించారు. తొక్కిసలాట జరిగిన తర్వాత అల్లు అర్జున్ మేనేజర్ సంతోష్‌ను కలిసి తొక్కిసలాటలో మహిళ చనిపోయారు, బాలుడు తీవ్రంగా గాయపడ్డారు, పరిస్థితి అదుపు తప్పింది, థియేటర్ నుంచి వెళ్లిపోవాలని సూచించామని, అందుకు మేనేజర్ తమను అల్లు అర్జున్ వద్దకు వెళ్లనీయలేదని చెప్పారు. అయినా అతి కష్టం మీద వారిని నెట్టుకుంటూ వెళ్లి ఈ విషయం అల్లు అర్జున్‌కు చెప్పామని తెలిపారు. దీంతో ఆయన వెళ్లడానికి అధికారులంతా సహకరించి రూట్ క్లియర్ చేశారని వివరించారు. దయ చేసి ఇక్కడి నుంచి ఖాళీ చేయండి అన్ని చెప్పారని, సినిమా చూసిన తర్వాతే వెళ్తానని అల్లుఅర్జున్ అన్నారని ఏసీపీ తెలిపారు. దాంతో పరిస్థితిపై డీసీపీకి చెప్పినట్లు వివరించారు. ఆయనను కలవడానికి తాము లోనికి వెళ్లిన వీడియోలు ఉన్నాయని, అల్లుఅర్జున్‌తో మాట్లాడే ఫుటేజ్ కోసం ప్రయత్నించినా దొరకలేదని ఏసీపీ మీడియాకు వివరించారు.

#### ఇక నుంచి ఊరుకునే ప్రసక్తే లేదు

సంధ్య థియేటర్ ఘటనపై దర్యాప్తు కొనసాగతోందని, న్యాయపరమైన సలహాలు తీసుకుని ముందుకెళ్తామని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ చెప్పారు. డిసెంబరు 4న సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనపై మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను ఆయన విడుదల చేశారు. ఇక నుంచి బౌన్సర్లు పోలీసులను ముట్టుకున్నా, మిస్ బిహేవ్ చేసినా వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు.

## ఎవరిపై కక్షసాధింపులు లేవు

### రేవంత్ వ్యాఖ్యలు సరైనవే

### బండి సంజయ్, పురందేశ్వరిపై మంత్రి పొన్నం మండిపాటు

**వేములవాడ, మహా :** అల్లు అర్జున్ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటన సరైందేనని, రాష్ట్ర ప్రభుత్వానికి ఎవరిపై కక్ష సాధింపు లేదని, ఎవరిని వేధించాలన్న ఉద్దేశ్యం లేదన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. శ్రీతేజ కుటుంబాన్ని పరామర్శించి తర్వాత సంజయ్ స్పందించాలన్నారు. ఏపీ టీడీపీ చీఫ్ పల్లా శ్రీనివాస్, ఎంపీ పురందేశ్వరి వ్యాఖ్యలను ప్రస్తావించిన మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. వారు వారి రాష్ట్రంలో జరిగే అంశాలను చూసుకుంటే బాగుంటుందని హితవు పలికారు. సోషల్ మీడియాలో ఇంటర్నేషనల్ క్లాసెస్ చూసుకోండి, ముందు మీ రాష్ట్రానికి పరిమితమై సేవల గురించి ఆలోచన చేయండని సూచించారు. ఎంపీ పురందేశ్వరికి అంత హ్యూమన్ టచ్ ఉంటే పార్లమెంట్ లో జరిగిన దాడి సంఘటనలో రాహుల్ గాంధీపై హత్యాయత్నం కేసుపై పురందేశ్వరి సమాధానం చెప్పాలన్నారు. పార్లమెంట్ వేదికగా కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన చేసిన వ్యాఖ్యలను బీజేపీ అధిష్టానం ఎందుకు స్పందించడం లేదన్నారు. అంబేద్కర్ ను అవమానించిన అమిత్ షాను ఎందుకు తప్పు పట్టడం లేదని ప్రశ్నించారు,.ఎన్టీఆర్ ను ఉద్దేశించి అవే వ్యాఖ్యలు చేస్తే పురందేశ్వరి ఊరుకుంటారా అని మండిపడ్డారు. దమ్ముంటే బండి సంజయ్, పురందేశ్వరిలు అమిత్ షా వ్యాఖ్యలపై స్పందించాలని మంత్రి పొన్నం డిమాండ్ చేశారు.



## సినీ ప్రముఖులు మానవత్వంతో వ్యవహరించాలి

- అల్లు అర్జున్ అవగాహన లేకుండా ప్రవర్తిస్తున్నారు
- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

**మహా:** సినీ ప్రముఖులు వ్యాపారం చేసుకుంటే తప్పులేదని, అదే సమయంలో మానవత్వంతో వ్యవహరించాల్సిన అవసరముందని అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ సూచనలు చేస్తే అల్లు అర్జున్ ప్రెస్‌మీట్ పెట్టవలసిన అవసరం ఏమొచ్చిందని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ అభిప్రాయపడ్డారు. సీఎం రేవంత్, కాంగ్రెస్ ప్రభుత్వం సినీ పరిశ్రమను ప్రోత్సహిస్తుందని దానిలో భాగంగానే అల్లుఅర్జున్ సినిమాకు టికెట్ రేట్లు పెంచి ఆదుకున్న విషయాన్ని చామల గుర్తుచేశారు. 'సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటన గురించి సీఎం వాస్తవాలు ప్రజలకు వెల్లడిస్తే హీరో అల్లు అర్జున్ ప్రెస్‌మీట్ పెట్టి ఎవరో రాసిచ్చిన నోట్ చదివి వెళ్లిపోయారు తప్ప, బాధ్యతగా వ్యవహరించలేదని' చామల కిరణ్ కుమార్ తెలిపారు. అల్లు అర్జున్ ప్రజలకు ఏం సందేశం చెప్పాలనుకుంటున్నారో కనీస అవగహన లేకుండా ప్రవర్తిస్తున్నారని చామల విమర్శించారు. ప్రముఖులు భయటకు వెళ్లినప్పుడు ప్రజలకు ఇబ్బంది కలగకుండా బాధ్యతగా ఉండాలని సీఎం రేవంత్ చెప్పినప్పుడు హీరోను టార్గెట్ చేస్తున్నారనడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు హీరోలను రియల్ హీరోలుగా అనుకుంటారు కనుక నిజ జీవితంలోనూ సినీ హీరోలు సినిమాలోనే కాదు నిజ జీవితంలోనూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు.



## అల్లు అర్జున్‌కు బండి సంజయ్ మద్దతు

### తెలుగు సినిమా ఇండస్ట్రీపై సీఎం రేవంత్ పగ బట్టినట్లుంది

### అసెంబ్లీలో కథ అల్లి మసీఎం మాట్లాడారు.. ఎంఐఎం ఐరన్ లెగ్ పార్టీ

**హైదరాబాద్, మహా :** సంధ్య థియేటర్ ఘటనలో సినీ నటుడు అల్లు అర్జున్ కు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అండగా నిలిచారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ ఱెడ్డ చేసిన వ్యాఖ్యలు తెలుగు సినీ పరిశ్రమపై బట్టినట్లుగా ఉన్నాయని మండిపడ్డారు. సంధ్య థియేటర్ ఘటనలో మహిళ మరణాన్ని ప్రతి ఒక్కరూ ఖండించారని, శ్రీతేజ్ కోలుకోవాలని ప్రతి ఒక్కరూ కోరుకోవడంతో పాటు అందరూ ఆ కుటుంబానికి బాసటగా నిలిచినట్లు వెల్లడించారు. సమస్య ముగిసిన తరువాత అసెంబ్లీలో ఎంఐఎం సభ్యుడితో ప్రశ్న అడిగించుకుని సినిమా లెవల్‌లో కథ అల్లి మళ్లీ సమస్యను సృష్టించటం సిగ్గు చేటని సంజయ్ విరుచుకుపడ్డారు. ఎంఐఎంతో కలిసి పక్కా ప్రణాళిక ప్రకారం పవిత్రమైన అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం సినిమా ఇండస్ట్రీని దెబ్బతీసే కుట్ర చేస్తోందని ఫైరయ్యారు. ఎంఐఎం ఐరన్ లెగ్ పార్టీ అని సంజయ్ విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ పంచన చేరి ఆ పార్టీని నిండా ముంచిందన్నారు. ఆ పార్టీని నమ్ముకుంటే కాంగ్రెస్ పార్టీకి అదే గతి పడుతుందని హెచ్చరించారు. గురుకులాల్లో విషాహారం తిని విద్యార్థులు చస్తుంటే ఏనాడైనా పరామర్శించారా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హాస్టళ్లలో పురుగుల అన్నం తిని, పాముకాటుకు గురై నిత్యం చనిపోతుంటే మీరెన్నడైనా బాధ్యత వహించారా? అని నిలదీశారు. మీకో న్యాయం, ఇతరులకు ఒక న్యాయమా? అని ప్రశ్నించారు. ఇకనైనా రేవంత్ రెడ్డి కక్ష సాధింపు చర్యలను వీడాలని హితవు పలికారు. లేనిపక్షంలో బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సీఎం సోదరుడి పేరు రాసి ఆత్మహత్య చేసుకున్నారని, ఆ ఘటనపై చట్టం నిక్కచ్చిగా పని చేసిందా సీఎం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కావాలని కాంగ్రెస్ పార్టీ తెలుగు సినీ రంగాన్ని వేధింపులకు గురి చేస్తుందని సంజయ్ దుయ్యబట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగు సినీ రంగంపై దాడులు పెరిగాయని సంజయ్ గుర్తు చేశారు.



## నెగిటివ్ పోస్టులకు దూరంగా ఉండండి

### అభిమానులకు అల్లు అర్జున్ వినతి

**హైదరాబాద్, మహా :** సోషల్ మీడియాలో నెగెటివ్ పోస్టులు పెట్టే వారికి దూరంగా ఉండాలని తన అభిమానులకు హీరో అల్లు అర్జున్ సూచించారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేధికగా అర్జున్ ఓ లేఖ విడుదల చేశారు. తమ అభిప్రాయాలను బాధ్యతాయుతంగా వ్యక్తపరచాలని, ఎవరినీ వ్యక్తిగతంగా కించపరిచే విధంగా పోస్టులు పెట్టవద్దని ఆయన అభిమానులకు విజ్ఞప్తి చేశారు. ఫ్యాన్స్ ముసుగులో గత కొన్ని రోజులుగా ఫేక్ ఐడీ, ప్రొఫైల్స్‌తో పోస్టులు వేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని అర్జున్ హెచ్చరించారు. నెగెటివ్ పోస్టులు వేస్తున్న వారికి దూరంగా ఉండాలని అభిమానులకు విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్‌లోనే కాదు ఆఫ్‌లైన్‌లోనూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అర్జున్ కోరారు.



## ఐకాన్ స్టార్ ఐతే ఏంటి?

### సీఎంకు సారీ చెప్పాలి.. మంత్రి కోమటిరెడ్డి ఫైర్


**హైదరాబాద్, మహా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సినీనటుడు అల్లు అర్జున్ వెంటనే క్షమాపణలు చెప్పాలని సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. తన ఇమేజ్ దెబ్బతీశారంటూ ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై ఎదురుదాడిగా మాట్లాడటం సరి కాదన్నారు. శనివారం మీడియా సమావేశంలో అల్లు అర్జున్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తాజాగా స్పందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించేందుకు లీగల్ టీమ్ ఒప్పుకోలేదనడం హాస్యాస్పదం. అసెంబ్లీలో ఈ విషయాన్ని ప్రస్తావిస్తే ఇమేజ్ దెబ్బతిన్నదని అంటున్నారని మండిపడ్డారు. సినిమాటోగ్రఫీ మంత్రిగా చెబుతున్నా ఇక నుంచి బెనిఫిట్ షోలు ఉండవని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రోసారి స్పష్టంగా తెలిపారు. త్వరలో సినీ ఇండస్ట్రీ పెద్దలతో భేటీ అయి చర్చిస్తామని మంత్రి వెల్లడించారు. మంచి సినిమాలు తీస్తే తప్పకుండా ప్రోత్సహిస్తాం, సినీరంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను అల్లు అర్జున్ తప్పుబట్టడం సరికాదని, అల్లు అర్జున్ వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలన్నారు. తొక్కిసలాటపై అసెంబ్లీలో తన ఇమేజ్ దెబ్బతీశారని అల్లు అర్జున్ అంటున్నారు.. కానీ, సీఎం వ్యక్తిగతంగా ఎవరి గురించి మాట్లాడలేదని.. ఆరోజు జరిగిన ఘటనను పూర్తిగా వివరించి చెప్పారన్నారు. రేవతి మరణానికి అల్లు అర్జున్ కారణమయ్యాడని మంత్రి అన్నారు. పోలీసులు వద్దని చెప్పినా.. అల్లు అర్జున్ రావడం వల్లే తొక్కిసలాట జరిగిందన్నారు. అల్లు అర్జున్ పోలీసులతో దురుసుగా ప్రవర్తించారన్నారు. ఈ ఘటన జరిగిన తర్వాత ఆయన వెళ్లి కనీసం బాధితులను పరామర్శించలేదని మండిపడ్డారు. అరెస్ట్ సమయంలో పోలీసులు ఎంతో సహనంతో వ్యవహరించారన్నారు. ఒక వ్యక్తి ప్రాణం పోవడం మామూలు విషయం కాదన్నారు. అల్లు అర్జున్ ఐకాన్ స్టార్ అయితే ఏంటీ? చట్టం ముందు అందరూ సమానులేనని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు. స్టార్లకు ప్రత్యేక మినహాయింపులు ఏమీ ఉండవన్నారు. తప్పు చేస్తే నటుడికైనా.. ఎమ్మెల్యేకైనా శిక్ష తప్పదన్నారు.



# అస్సలు వదలొద్దు

### నిందితులపై చర్యలు తీసుకోవాల్సిందే.. సంధ్య థియేటర్ ఘటనపై సీపీఐ నారాయణ

**హైదరాబాద్, మహా:** టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 చిత్రం.. హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద చోటు చేసుకున్న పరిణామాలపై తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. సినిమా రిలీజ్ అయిన రోజే థియేటర్ వద్దకు కుటుంబంతో సహా వెళ్లి అల్లు అర్జున్ తొక్కిసలాటకు కారణమయ్యారనే చర్చ జరుగుతున్న తరుణంలో తెలంగాణ ప్రభుత్వం కూడా ఆయన విషయంలో కఠినంగానే వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో సీపీఐ నారాయణ కూడా స్పందించారు. పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా చోటు చేసుకున్న ఘటనలపై స్పందిస్తూ సీపీఐ నారాయణ ఓ వీడియో విడుదల చేశారు. ఇందులో ఆయన తొలుత తెలంగాణ ప్రభుత్వం పుష్ప 2 సినిమా టికెట్ రేట్లు పెంచుకునేందుకు ఇచ్చిన అనుమతిని సైతం తప్పుబట్టారు. అయితే సంధ్య థియేటర్ ఘటన నేపథ్యంలో ఇందుకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డిని సీపీఐ నారాయణ కోరారు. ఇదేమీ సమాజానికి ఉపయోగపడే సినిమా కాదని, ప్రభుత్వం టికెట్ రేట్ల పెంపుకు అనుమతి ఇవ్వకుండా ఉండాల్సిందని నారాయణ వ్యాఖ్యానించారు. సంధ్య థియేటర్ ఘటనలో పోలీసుల తప్పేం లేదని సీపీఐ నారాయణ తెలిపారు. ఈ ఘటనపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి ఘటనలు జరగకుండా సినీ ఇండస్ట్రీ, ఆర్టిస్టులు, రాజకీయ నేతలు తగిన చర్యలు చేపట్టాలన్నారు. సంధ్య థియేటర్ ఘటనలో బాధితుల్ని ప్రభుత్వం ఆదుకోవాలని, త్వరలో తమ పార్టీ తరఫున కూడా సాయం ప్రకటిస్తామని నారాయణ తెలిపారు. ఇప్పటికే సంధ్య థియేటర్ ఘటనపై ప్రభుత్వం అల్లు అర్జున్ పై సీరియస్ అవుతున్న నేపథ్యంలో నారాయణ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



## పేద మహిళ చనిపోతే బాధనిపించలేదా...?

- చిరంజీవిని కేంద్ర మంత్రిని చేసింది కాంగ్రెస్‌యే
- బండి సంజయ్‌పై మహేశ్ కుమార్ గౌడ్ ఫైర్
- ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకే ప్రతిపక్షాల రాద్ధాంతం

**నిజామాబాద్, మహా :** అల్లు అర్జున్ వ్యవహారంలో సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ పై ఫైర్ టీ పీసీసీ చీఫ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అయ్యారు టీ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్. అల్లు అర్జున్ వ్యక్తిత్వాన్ని హననం చేసేలా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేశారని, తెలుగు సినిమా ఇండస్ట్రీపై పగబట్టినట్లుగా రేవంత్ తీరు ఉందని బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు ఘాటుగా కౌంటర్ ఇచ్చారు టీ పీసీసీ చీఫ్. అల్లు అర్జున్ వ్యవహారంలో అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన వివరణ సమంజసంగానే ఉందన్నారు. పేద మహిళ చనిపోతే లేని బాధ సినిమా రంగంపై ఎందుకు? అని బండి సంజయ్ కి సూటి ప్రశ్న వేశారు. సినీ పరిశ్రమపై మాకు కూడా ప్రేమ ఉంది కానీ ప్రజల ప్రాణాలే ముఖ్యం అని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకే ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. చిత్ర పరిశ్రమ అంటే కాంగ్రెస్ పార్టీకి అభిమానమని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సినీ వర్గం నుంచి చిరంజీవికి కేంద్రమంత్రి పదవి ఇచ్చిందని గుర్తు చేశారు. సినీ ఇండస్ట్రీ మద్రాస్ నుంచి హైదరాబాద్ రావడానికి ప్రధాన కారణం కాంగ్రెస్ పార్టీ అని సంజయ్ గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఏ వ్యక్తులపై ద్వేషాలు ఉండవని, ప్రభుత్వానికి అందరూ సమానమే అని తేల్చి చెప్పారు. సెలబ్రిటీలైనంత మాత్రాన ఏదైనా చేస్తాం, ఏమైనా మాట్లడుతామంటే ఎలా అని ప్రశ్నించారు. సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఎవరైనా వ్య.వహరించవచ్చని, మహిళ చనిపోయిందని తెలిసినా కనీసం స్పందించకుండా తన సినిమా హిట్ కోసం రోడ్ షోలు చేస్తూ వెళ్ళడం ఏమిచని అడిగారు. అసెంబ్లీలో సీఎం చెప్పింది థప్పన్న సినీ నటుడు వాస్తవాలను పోలీసులు బయటపెట్టారని, ఇప్పటికైనా తప్పును తెలుసుకుని ప్రశ్చాత్తాపానికి రావాలన్నారు. ఈ విషయంలో సెలబ్రిటీకి కేంద్ర మంత్రి కొంత సలహా ఇస్తే బాగుంటుందన్నారు. రాష్ట్రాన్ని యధేచ్ఛగా దోచుకున్న కుటుంబం కేసీఆర్ కుటుంబం అని విరుచుకుపడ్డారు. ఫార్ములా ఈ రేసింగ్ లో అడ్డంగా దొరికిపోయిన నేత కేటీఆర్ అని ధ్వజమెత్తారు. మొన్నటివరకు జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పిన కేటీఆర్.. ఇపుడు కోర్టును ఆశ్రయిస్తున్నాడని విమర్శించారు.



## అల్లు అర్జున్ ఇంటిపై దాడి.. తీవ్రంగా స్పందించిన సీఎం రేవంత్

### శాంతి భద్రతల విషయంలో కఠినంగా ఉండండి.. డిజిపి, సీపీలకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

**హైదరాబాద్, మహా:** అల్లు అర్జున్ ఇంటిపై దాడి నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. సినీ ప్రముఖుల ఇళ్ల పై దాడి ఘటనను ఖండిస్తున్నానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాల్సిందిగా రాష్ట్ర డీజీపీ, నగర పోలీసు కమిషనర్ ను ఆదేశిస్తున్నానని, ఈ విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదన్నారు. సంధ్య థియేటర్ ఘటనలో సంబంధం లేని పోలీసులు ఎవరూ స్పందించవద్దని ఆదేశించారు. పరోక్షంగా ఆదివారం మీడియా సమావేశం నిర్వహించిన విష్ణుమూర్తి వ్యవహారంపై సీరియస్ అయ్యారు. ఇతర సిబ్బంది స్పందించకుండా ఉన్నతాధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.




## మొహాలీలో కుప్పకూలిన మూడంతస్తుల బిల్డింగ్..
# 20 ఏండ్ల యువతి దుర్మరణం



**చండీగఢ్:** పంజాబ్‌లోని మొహాలీలో మూడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో సహాయక చర్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ ఘటనలో 20 ఏండ్ల యువతి మరణించింది. ఆమెను హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన దృష్టి వర్మగా గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. మొహాలీ జిల్లాలో ఓ భవనంలో బేస్‌మెంట్ కోసం తవ్వకాలు జరుగుతుండగా.. పక్కనే ఉన్న మూడంతస్తుల భవనం శనివారం సాయంత్రం కుప్పకూలింది. దీంతో రంగంలోకి దిగిన ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృంధాలు నిర్విరామంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు ఓ యువతి మృతదేహాన్ని వెలికి తీశామని, భవనం శిథిలాల కింద పది మంది వరకు చిక్కుకుని ఉంటారని అధికారులు తెలిపారు. ఇప్పటికే పలువురిని రక్షించామని, అత్యవసర చికిత్స నిమిత్తం వారిని దవాఖానకు తరలించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయన్నారు. కూలిపోయిన బిల్డింగ్‌లో జిమ్ కూడా నడుస్తున్నట్లు చెప్పారు. కాగా, ఈ ఘటనపై బీఎన్ఎస్ 105 సెక్షన్ కింద భవన యజమానులు పర్వీందర్ సింగ్, గగన్‌దీప్ సింగ్‌లపై పోలీసులు కేసు నమోదుచేశారు.

# అంగీకార శృంగారం రేప్ కాదు

**వేధింపుల కోసం చట్టాన్ని వాడుకోవద్దు.. ఢిల్లీ హైకోర్టు సంచలన తీర్పు**



**న్యూఢిల్లీ, డిసెంబర్ 21:** పరస్పర అంగీకారంతో జరిగిన శృంగారాన్ని లైంగిక దాడిగా పరిగణించలేమని ఢిల్లీ హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. చట్టంలోని సెక్షన్లను కొందరు పురుషులను వేధించేందుకు ఉపయోగిస్తున్నారని స్పష్టం చేసింది. తనపై నమోదైన రేప్ కేసును కొట్టివేయాలంటూ ఓ యువకుడు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ చంద్రధారి సింగ్‌తో కూడిన ధర్మాసనం యువతి ఉద్దేశపూర్వకంగానే కేసు పెట్టినట్టు స్పష్టమవుతున్నదని పేర్కొంది. ఈ మేరకు యువకుడిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని పోలీసులను ఆదేశించింది. కేసు విచారణ, తీర్పు సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. అత్యాచారం మహిళలపై జరిగే చాలా హేయమైన చర్య. కానీ కొందరు మహిళలు తమతో సంబంధం కలిగిన పురుషుడిని వేధించేందుకు చట్టాన్ని ఆయుధంగా వాడుకుంటున్నారు. యువకుడు సమర్పించిన వాట్సప్ చాటింగ్‌లు, రికార్డింగ్స్ బట్టి చూస్తే ఇద్దరూ పరస్పరం అంగీకారంతోనే శారీరక బంధంలోకి ప్రవేశించినట్టు స్పష్టమవుతున్నది. స్త్రీలు చట్టాన్ని దుర్వినియోగం చేయడం వల్ల పురుషులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటారో చెప్పేందుకు ఈ కేసు స్పష్టమైన ఉదాహరణ.ఇలాంటి కేసుల్లో ఫిర్యాదుదారుల ఉద్దేశాలను కూడా కోర్టులు పరిశీలించాలి. అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తరఫు న్యాయవాది యువకుడిపై యువతి తీవ్రమైన ఆరోపణలు చేశారని, కేసును కొట్టివేయవద్దని కోరారు. స్పందించిన న్యాయమూర్తి ఆధారాల ప్రకారం చూస్తే ఇరువురు పెళ్లి చేసుకోవాలని అనుకున్నారు. కానీ కులాలు వేర్వేరు కావడంతో ఇరువురి కుటుంబ సభ్యులు ఒప్పుకోలేదు. కుటుంబ సభ్యులు ఒప్పుకోకపోయినా పెళ్లి చేసుకోవడానికి సిద్ధమని యువకుడు తెలిపాడు. కానీ ఆమె మరో యువకుడితో పెళ్లికి అంగీకరించడంతో ప్రేమించిన యువకుడితో పెళ్లికి ఆసక్తి చూపలేదు అని న్యాయమూర్తి తెలిపారు. అందువల్ల యువకుడిపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ దురుద్దేశపూర్వకమైనదేనని, కాబట్టి కేసు చెల్లదని స్పష్టం చేశారు.

# ఇస్రో, ఈసా మధ్య ఒప్పందం..
# వ్యోమగాములకు శిక్షణపై సంతకాలు






**మహా. జాతీయం:** వ్యోమగాములకు శిక్షణ, పలు పరిశోధనలకు సంబంధించిన కార్యకలాపాలపై సహకరించేందుకు యూరోపియన్ స్పేస్ ఏజెన్సీతో ఒప్పందంపై సంతకం చేసినట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ శనివారం పేర్కొంది. ఈ ఒప్పందంపై ఇస్రో చీఫ్ ఎస్ సోమనాథ్, ఈసా డైరెక్టర్ జోసెఫ్ అష్‌బాచర్ ఒప్పందంపై సంతకం చేశారు. రెండు సంస్థలు మానవ అన్వేషణ, పరిశోధనల్లో సహకరిస్తాయని ఇస్రో ప్రకటనలో పేర్కొంది. వ్యోమగామి శిక్షణ, ప్రయోగాలు, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఈసా సౌకర్యాల వినియోగం, మానవ, బయోమెడికల్ పరిశోధన ప్రయోగాల అమలు, అలాగే విద్య, ప్రజా అవగాహన కార్యకలాపాలు కలిసి పనిచేస్తాయని ఇస్రో తెలిపింది.

ఆక్సియం4 మిషన్‌లో ఇస్రో గగన్‌యాన్, ఈసా వ్యోమగాములు ఉన్నారని ప్రకటనలో పేర్కొంది. ఈ మిషన్‌లో భారత శాస్త్రవేత్తలు చేసిన కొన్ని ఆవిష్కరణలను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉపయోగిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఇస్రో మానవ సహిత స్పేస్ ఫ్లైట్‌కి రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసిందని సోమనాథ్ అన్నారు. భారత్ తన స్వదేశీ అంతరిక్ష కేంద్రంని సైతం నిర్మించనున్నది. ఈసాతో సహకారానికి కొత్త మార్గాలను తెరవనున్నది. ఇంతులో ఈసా చీఫ్ ఈ ఒప్పందాన్ని రెండు ఏజెన్సీలకు చాలా ముఖ్యమైనదని అభివర్ణించారు. ఈ ఒప్పందం రెండింటి మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆయన అన్నారు. ఆక్సియం4 మిషన్ కోసం ఉమ్మడి పని పురోగతిపై ఇస్రో, ఈసా చీఫ్‌లు కూడా సంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మానవ అంతరిక్ష కార్యకలాపాల రంగంలో నిరంతర సహకారాన్ని కొనసాగించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సీసాలతో యాంటీ బయాటిక్ నిరోధకత!



**న్యూఢిల్లీ:** ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ సీసాల్లోని నానో ప్లాస్టిక్‌లు యాంటీ బయాటిక్ నిరోధకతను పెంచే ప్రమాదం ఉందని మొహాలీలోని సూక్ష్మ శాస్త్ర, సాంకేతిక సంస్థ(ఐఎన్ఎస్‌టీ) శాస్త్రవేత్తలు తెలిపారు. ప్లాస్టిక్ కాలుష్యం, యాంటీ బయాటిక్ నిరోధకతపై ఆందోళనలు పెరుగుతున్న వేళ జర్నల్ నానో స్కేల్‌లో ప్రచురితమైన ఈ కొత్త అధ్యయనం ఇప్పటిదాకా గుర్తించని ప్రజారోగ్య ప్రమాదాన్ని గురించి నొక్కి చెప్పింది. మానవ జీర్ణాశయ వ్యవస్థ(గట్)లోకి నానో ప్లాస్టిక్స్ చేరి సూక్ష్మజీవులతో కలుస్తున్నాయని, ఇవి ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయని అధ్యయనం తెలిపింది. నానో ప్లాస్టిక్స్ యాంటీ బయాటిక్ నిరోధకత కలిగిన జన్యువులను లాక్టోబాసిల్లస్ అసిడోఫిలస్ లాంటి ప్రయోజకర బాక్టీరియాలోకి చేరుస్తున్నాయని, దీంతో గట్ బ్యాక్టీరియా దెబ్బతింటున్నదని పరిశోధకులు గుర్తించారు. ఫలితంగా ఇన్‌ఫెక్షన్ల ముప్పు పెరుగుతుందని తేల్చారు.

# ఎన్పీఏల పాపం యూపీఏదే

**ప్రభుత్వంలోని అవినీతే అందుకు కారణం.. వాటి రద్దుపై మోదీ చర్యలు ప్రశంసనీయం**

**ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్**



**న్యూఢిల్లీ:** యూపీఏ ప్రభుత్వ హయాంలోని అవినీతి కారణంగానే బ్యాంకుల్లో నిరర్థక ఆస్తులు (ఎన్పీఏ) పెరిగిపోయాయని రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ ఆరోపించారు. ఈ సమస్యను అధిగమించడానికి వాటిని రద్దు చేస్తూ మోదీ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఆయన ప్రశంసించారు. నాటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వద్దకు తాను వెళ్లి ‘బ్యాంకుల్లో వసూలు కానీ బాకీల నుంచి బయటపడాలి. అవి వసూలు అవ్వకపోతే మనం రుణాలు ఇవ్వలేం. వ్యవస్థను శుభ్రం చేయాలి’ అని చెప్పగా, సరే అలాగే ముందుకు సాగండి అని ఆయన అనుమతి ఇచ్చారని అన్నారు. గత యూపీఏ ప్రభుత్వ ఆర్థిక విధానాల కారణంగా పెద్దయెత్తున బ్యాంకుల్లో మొండి బకాయిలు పేరుకుపోయాయన్నారు. ‘ఆర్థిక సంక్షోభం తర్వాత గతంలో ప్రారంభించిన అనేక ప్రాజెక్టులు ఇబ్బందుల్లో పడ్డాయి. భారత దేశం ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని మించి ఇబ్బందులు ఎదుర్కొంది. యూపీఏ ప్రభుత్వ అవినీతి, కుంభకోణాల కారణంగా ప్రాజెక్టుల అనుమతిలో తీవ్ర జాప్యం ఏర్పడింది. పర్యావరణ అనుమతులు లభించ లేదు. దాంతో ఆర్థిక వ్యవస్థలో ఎన్పీఏలు కూడా పేరుకుపోయాయి’ అని ఆయన వివరించారు. ఈ ఆర్థిక సంక్షోభం కారణంగా తన ముందు పాలకులు ఆర్‌బీఐలో రుణాలను మొండి బకాయిలుగా ప్రకటించడంపై మారటోరియను అనుమతించే విధానాన్ని అమలు చేశారని చెప్పారు. దీని ఫలితంగా బ్యాంకుల్లో మొండి బకాయిలను గుర్తించకుండా ఉంచడంతో అవి పెద్దమొత్తంలో పేరుకుపోయాయన్నారు. తాను బాధ్యతలు చేపట్టిన మొదటి ఏడాది 2014లోనే మారటోరియాన్ని రద్దు చేశానన్నారు. దాంతో చాలా మొండి బకాయిలు కూడా రద్దయ్యాయన్నారు. ఇలాంటి ప్రక్షాళన బ్యాంకింగ్ వ్యవస్థకు అవసరమని అన్నారు. ఈ మొండి బకాయిలను బ్యాలెన్స్ షీట్‌ల్లో ప్రతి ఏడాది చూపుకుంటూ పోతే బ్యాంకులు ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేవని, కొత్త రుణాలు ఇవ్వలేవని రఘురామ్ రాజన్ అన్నారు.

### ఎన్పీఏ అంటే ఏమిటి?

బ్యాంకులు ఖాతాదారులకు ఇచ్చే రుణాన్ని ఆస్తిగా పరిగణిస్తాయి. ఇలా తాము ఇచ్చిన రుణంపై అసలు కానీ, వడ్డీ కానీ వసూలు కాకపోతే బ్యాంకుకు నష్టం కనుక వాటిని నిరర్థక ఆస్తులు (ఎన్పీఏ)గా పరిగణిస్తాయి. అందుకే వీటిని నియంత్రించడానికి ఆర్‌బీఐ నిత్యం అనేక విధానాలను ప్రవేశపెడుతూ ఉంటుంది. బ్యాంకు రుణ పోర్ట్‌పోలియో చూసినప్పుడు ఈ ఎన్పీఏల శాతం తక్కువగా ఉండాలి. ఈ ఎన్పీఏల శాతం ఎక్కువగా ఉంటే ఆ బ్యాంకు పరితీరు ఆశాజనకంగా లేదని అర్థం. ఒక పారిశ్రామికవేత్త వెయ్యి కోట్లు రుణం తీసుకుని చెల్లించకపోతే బ్యాంక్ బ్యాలెన్స్ షీట్‌లో ఆ వెయ్యి కోట్లను ఎన్పీఏలుగా చూపిస్తారు. ఈ ఎన్పీఏల ప్రభావం బ్యాంకు లాభదాయకతపై పడుతుంది. ఎన్పీఏల శాతం ఎక్కువగా ఉంటే బ్యాంక్ దివాలా కూడా తీయవచ్చు.



# బాల్య వివాహాలపై కేసులు.. 400 మందికిపైగా అరెస్ట్

**గౌహతి:** బాల్య వివాహాలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. రాత్రి వేళ ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. 400 మందికిపైగా అరెస్ట్ చేశారు. బీజేపీ పాలిత అస్సాంలో ఈ సంఘటన జరిగింది. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఆ రాష్ట్రంలో కేసులు నమోదు చేస్తున్నారు. మూడో విడతలో భాగంగా 335 కేసులు నమోదు చేశారు. శనివారం అర్ధరాత్రి వేళ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ కేసులకు సంబంధించి 416 మందిని అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన వారిని ఆదివారం కోర్టులో ప్రవేశపెడతామని సీఎం హిమంత బిస్వా శర్మ తెలిపారు. ఈ సాంఘిక దురాచారాన్ని అంతం చేసేందుకు సాహసోపేతమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. కాగా, అస్సాం రాష్ట్ర ప్రభుత్వం 2023లో రెండు దశల్లో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. గత ఏడాది ఫిబ్రవరిలో చేపట్టిన తొలి దశ డ్రైవ్‌లో 4,515 కేసులు నమోదు చేసిన పోలీసులు 3,483 మందిని అరెస్టు చేశారు. గత ఏడాది అక్టోబర్‌లో నిర్వహించిన రెండో దశ డ్రైవ్‌లో 710 కేసులు నమోదు చేసి 915 మందిని అరెస్టు చేశారు. తాజాగా మూడో దశ డ్రైవ్‌లో 335 కేసులు నమోదు చేసిన పోలీసులు 416 మందిని అరెస్ట్ చేశారు.

# ‘నమ్మకంపై నిర్మించుకునే బంధమే పెండ్లి’




**న్యూఢిల్లీ, డిసెంబర్ 21:** పెండ్లి అనేది పరస్పర నమ్మకం, సహచర్యం, పంచుకున్న అనుభవాలపై నిర్మించుకునే బంధమని సుప్రీంకోర్టు పేర్కొన్నది. తమిళనాడుకు చెందిన ఓ జంట 2004 నుంచి విడిగా ఉంటున్నారు. వీరికి 2018లో మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ విడాకులు మంజూరు చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ మహిళ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీబీ వరాలేతో కూడిన ధర్మాసనం విచారించింది. ‘వివాహ బంధానికి కీలకమైన పరస్పర నమ్మకం, సహవాసం, అనుభవాలు పంచుకోవడం అనే అంశాలు చాలాకాలం పాటు దంపతుల నడుమ లేకపోతే ఆ వివాహ బంధం కేవలం చట్టపరమైన లాంఛనంగా మారిపోతుంది’ అని పేర్కొన్న ధర్మాసనం మద్రాస్ హైకోర్టు తీర్పును సమర్థించింది. భార్యకు భరణం కింద రూ.50 లక్షలు, కూతురి చదువు, పెండ్లి కోసం మరో రూ.50 లక్షలు చెల్లించాలని భర్తను ఆదేశించింది.

## సంభాల్‌లో కొనసాగుతున్న తవ్వకాలు..
# బయటపడిన 150 ఏళ్ల నాటి మెట్ల బావి



లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ జిల్లాలో పురావస్తు శాఖ ఆధ్వర్యంలో తవ్వకాలు కొనసాగుతున్నాయి. జిల్లాలోని చందౌసి ప్రాంతంలో ఒక మెట్ల బావిని (Stepwell) ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) బృందం గుర్తించింది. సంభాల్ జిల్లా కలెక్టర్ రాజేంద్ర పెన్సియా ఆదివారం ఈ విషయాన్ని మీడియాకు తెలిపారు. 400 చదరపు మీటర్ల విస్తీర్ణంలో 150 ఏళ్ల నాటి ‘బావోలి’ని కనుగొన్నట్లు చెప్పారు. ఈ మెట్ల బావి చుట్టూ నాలుగు గదులతో కూడిన పాలరాతి నిర్మాణాలు, కొన్ని అంతస్తులు ఉన్నాయని వివరించారు. ‘ఈ అహ్‌బావోలి తలాబ్‌ను బిలారి రాజు తాత కాలంలో నిర్మించినట్లు తెలుస్తున్నది. రెండు, మూడు అంతస్తులు పాలరాతితో, పై అంతస్తులు ఇటుకలతో నిర్మించారు. తవ్వకం చుట్టూ నాలుగు గదులు ఉన్నాయి’ అని మీడియాతో అన్నారు. కాగా, శనివారం స్థానికంగా సమావేశం నిర్వహించిన తర్వాత పురావస్తు శాఖ ఆధ్వర్యంలో అక్కడ తవ్వకాలు ప్రారంభమైనట్లు జిల్లా కలెక్టర్ రాజేంద్ర పెన్సియా తెలిపారు. మెట్ల బావిని గుర్తించిన నిర్మాణం పూర్తిగా మట్టితో కప్పి ఉందని చెప్పారు. మున్సిపల్ సిబ్బంది మట్టిని తొలగిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం 210 చదరపు మీటర్లు మాత్రమే బయట పడిందని తెలిపారు. మిగిలిన ప్రాంతం ఆక్రమణలో ఉందన్నారు. ఆక్రమణలు తొలగించడానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.


## గాజాపై వైమానిక దాడులు..
# 77 మంది మృతి



**గాజా:** గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో శుక్రవారం 77 మంది మరణించినట్లు గాజా ఆరోగ్య శాఖ శనివారం వెల్లడించింది. మృతుల్లో ఐదుగురు చిన్నారులున్నారని, 174 మంది గాయపడ్డారని తెలిపింది. నిరాశ్రయులు తలదాచుకున్న షాబన్ రయాస్ స్కూలుపై గురువారం ఇజ్రాయెల్ సేనలు జరిపిన వైమానిక దాడులలో ఐదుగురు పిల్లలతోసహా 12 మంది మరణించారు.గురువారం తెల్లవారుజామున దీర్ అల్ బలాలోని మగజీ శరణార్థ శిబిరంపై జరిగిన మరో వైమానిక దాడిలో ఐదుగురు మరణించారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు గాజాలో మొత్తం 45,206 మంది మరణించారు.

# వాట్సాప్ యూజర్లపై పెగాసస్ నిఘా


- ఎన్ఎస్ఓ గ్రూప్‌దే బాధ్యత
- ధ్రువీకరించిన అమెరికా కోర్టు



**న్యూయార్క్:** వాట్సాప్ వినియోగదారుల డివైజ్‌లలో అక్రమంగా పెగాసస్ స్పైవేర్‌ను జొప్పించిందని ఆరోపిస్తూ ఇజ్రాయెల్‌కు చెందిన ఎన్ఎస్ఓ సంస్థపై మెటా దాఖలు చేసిన కేసులో అమెరికా కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. వాట్సాప్ వినియోగదారుల డివైజ్‌ల హ్యాకింగ్‌కు ఎన్ఎస్ఓ గ్రూప్‌దే బాధ్యత అని స్పష్టం చేసింది. వాట్సాప్‌లోని బగ్‌ను ఉపయోగించుకొని అక్రమంగా స్పైవేర్‌ను జొప్పించిందని ఎన్ఎస్ఓ గ్రూప్‌పై మెటా సంస్థ 2019లో అమెరికా కోర్టును ఆశ్రయించింది. ఈ కేసును విచారించిన న్యాయమూర్తి ఫిల్లిస్ హమిల్టన్.. 1400 మంది వాట్సాప్ వినియోగదారుల డివైజ్‌లు లక్ష్యంగా మారడానికి పెగాసస్ స్పైవేర్ తయారుచేసిన ఎన్ఎస్ఓ గ్రూప్‌దే బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ సంస్థ సంబంధిత చట్టాల్లోని నిబంధనలను ఉల్లంఘించిందని పేర్కొన్నారు. కోర్ట్ వ్యాఖ్యల పట్ల మెటా సంస్థ హర్షం వ్యక్తం చేయగా, ఎన్ఎస్ఓ గ్రూప్ స్పందించలేదు.

### భారత్‌లోనూ పెగాసస్ ప్రకంపనలు

పెగాసస్ స్పైవేర్ ఉదంతం భారత్‌లోని ప్రకంపనలు రేపిన సంగతి తెలిసిందే. 300 భారతీయ మొబైల్ నెంబర్లపై పెగాసస్‌ను వినియోగించారని 2021లో వార్తలు వచ్చాయి. ఇందులో అప్పటి ఇద్దరు కేంద్రమంత్రులు, ముగ్గురు ప్రతిపక్ష పార్టీల నేతలు, జర్నలిస్టులు, వ్యాపారులు ఉన్నట్టు ఆరోపణలు సంచలనం రేపాయి. అయితే, ఈ ఆరోపణలకు ఆధారాలు లేవని అప్పటి ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ పార్లమెంటులో ప్రకటించారు. ఇప్పుడు అమెరికా కోర్టు తీర్పు నేపథ్యంలో మరోసారి దేశంలో పెగాసస్ స్పై వేర్ చర్చనీయాంశంగా మారింది.





## అలప్పుళ రైలులో
# అగ్నిప్రమాదం

**ఇల్లందువాసులు సురక్షితం**



**తిరువనంతపురం:** అలప్పుళ ఎక్స్‌ప్రెస్ రైలు (13351) కేరళలోని మధుకరై స్టేషన్ వద్ద శనివారం అగ్నిప్రమాదానికి గురైంది. ఈ రైలులో శబరిమలకు వెళ్తున్న తెలంగాణ ఇల్లెందుకు చెందిన 10 మంది అయ్యప్ప మాలాధారులు సురక్షితంగా ఉన్నారు. ఈ రైలు ధనాబాద్ జంక్షన్ నుంచి అలప్పుళ వెళ్తుండగా ఈ సంఘటన జరిగింది. బీ4, బీ5 బోగీల్లో మంటలను గుర్తించిన స్టేషన్ సిబ్బంది వెంటనే రైలును నిలిపేశారు. ప్రయాణికులు కూడా ప్రమాదాన్ని గుర్తించి హుటాహుటిన రైలు నుంచి దిగిపోయారు.

## హుండీలో జారిపడ్డ
# ఐఫోన్ దేవుడికే!



**చెన్నై:** తమిళనాడులో దినేశ్ అనే ఓ భక్తుడికి ఊహించని అనుభవం ఎదురైంది. తిరుపోరూర్‌లోని కందస్వామి ఆలయంలో అతడి ఐఫోన్ అనుకోకుండా హుండీలోకి జారి పడింది. ఖరీదైన తన ఫోన్‌ను తిరిగి ఇవ్వాలని అతడు కోరగా.. ‘నిబంధనల ప్రకారం అలా ఇవ్వలేం. ఆ ఫోన్ ఇక దేవుడి ఖాతాలోకి వెళ్లినట్టే!’ అని దేవాదాయ శాఖ శనివారం సమాధానమిచ్చింది. అందులోని డాటాను తీసుకోవచ్చని అతడికి సూచించింది.


## బంగ్లాదేశ్‌లో మళ్లీ హిందూ
# ఆలయాలపై దాడి

**ఢిల్లీ స్కూళ్లలో బంగ్లాదేశీలు ఉన్నారేమో గుర్తించండి**



**ఢాకా:** బంగ్లాదేశ్‌లో హిందూ ఆలయాలపై దాడులు ఆగడం లేదు. మైమెన్‌సింగ్, దినాజ్‌పూర్ జిల్లాల్లో గురు, శుక్రవారాల్లో మూడు ఆలయాలపై దుండగులు దాడికి తెగబడి, ఎనిమిది విగ్రహాలను ధ్వంసం చేశారు. అలాలుద్దిన్ అనే నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఢిల్లీలోని పాఠశాలల్లో బంగ్లాదేశ్‌కు చెందిన పిల్లలు ఉన్నారేమో గుర్తించాలని పాఠశాలలకు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్(ఎంసీడీ) సర్క్యులర్ జారీ చేసింది. ఎవరైనా ఉంటే తెలియజేయాలని ఆదేశించింది.

# హైదరాబాద్‌లో ఇండ్లకు తగ్గిన గిరాకీ



## అక్టోబర్-డిసెంబర్‌లో 47 శాతం పతనం
## ప్రాప్ ఈక్విటీ తాజా నివేదికలో వెల్లడి

**న్యూఢిల్లీ, డిసెంబర్ 21:** దేశవ్యాప్తంగా ఇండ్ల విక్రయాలు గరిష్ఠ స్థాయిలో పడిపోతున్నాయి. రోజురోజుకు అమ్మకాలు అంతకంతకు కిందకు దిగుతున్నాయి. ఆర్థిక వ్యవస్థ కుదేలవుతుండటం, మరోవైపు అస్తవ్యస్థ ఆర్థిక విధానాలతో పెట్టుబడిదారుల్లో నమ్మకం సడులుతున్నది. దీంతో ఒకప్పుడు ఉవ్వెత్తున ఎగిసిన దేశీయ రియల్ ఎస్టేట్ రంగం మళ్లీ అంతే వేగంతో కిందకు పడిపోతున్నది. ప్రస్తుతేడాది అమ్మకాలు చూస్తే ఇది అవగతం అవుతున్నది. ఇండ్ల అమ్మకాలపై ఈ మధ్యకాలంలో విడుదలైన నివేదికలు ఈ విషయాన్ని స్పష్టంచేస్తున్నాయి. తాజాగా ప్రాప్‌ఈక్విటీ సంస్థ విడుదల చేసిన గణాంకాలు కూడా ఈ విషయాన్ని స్పష్టంచేశాయి. అక్టోబర్‌డిసెంబర్ త్రైమాసికానికిగాను దేశవ్యాప్తంగా తొమ్మిది నగరాల్లో ఇండ్ల అమ్మకాలు 21 శాతం పడిపోయాయని వెల్లడించింది. ఢిల్లీఎన్‌సీఆర్, ముంబై, నవీ ముంబై, కోల్‌కతా, బెంగళూరు, పూణె, హైదరాబాద్, చెన్నై, థానే వంటి మెట్రో నగరాల్లో 1.08 లక్షల యూనిట్ల ఇండ్లు అమ్మడయ్యాయి. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో అమ్ముడైన 1,37,225 యూనిట్లతో పోలిస్తే భారీగా తగ్గాయి. కేవలం ఢిల్లీఎన్‌సీఆర్‌లో మాత్రమే విక్రయాలు పెరిగాయని తెలిపింది. ఇండ్ల అమ్మకాలు పడిపోయిన నగరాల్లో హైదరాబాద్ టాప్ ప్లేస్‌లో ఉన్నది. అక్టోబర్ డిసెంబర్ మధ్యకాలంలో హైదరాబాద్‌లో 12,682 యూనిట్లు అమ్ముడయ్యాయని, క్రితం ఏడాది నమోదైన 24,044తో పోలిస్తే 47 శాతం తగ్గాయని పేర్కొంది. అలాగే బెంగళూరులో గృహ విక్రయాలు 13 శాతం తగ్గి 14,957లకు పడిపోగా, చెన్నైలో 9 శాతం తగ్గి 4,673 యూనిట్ల నుంచి 4,266లకు జారుకున్నాయి. అధిక బేస్ రేట్ కారణంగా ఇండ్ల విక్రయాలు పడిపోయాయని ప్రాప్‌ఈక్విటీ సీఈవో, ఫౌండర్ సమీర్ జాసుజా తెలిపారు. పండుగ సీజన్ కావడంతో మూడో త్రైమాసికంతో పోలిస్తే ఆ తర్వాతి క్వార్టర్‌లో అమ్మకాలు పెరిగాయని తెలిపారు.

# బకాయిల చెల్లింపులు ఆలస్యమైతే కార్డుదారులకు వడ్డీ మోత!

## 30 శాతానికిపైగా వార్షిక వడ్డీరేటు.. బ్యాంకులు వేసుకోవచ్చన్న సుప్రీంకోర్టు
### 16 ఏండ్ల క్రితం ఎన్‌సీడీఆర్‌సీ ఇచ్చిన తీర్పు తోసిపుచ్చిన అత్యున్నత ధర్మాసనం

**న్యూఢిల్లీ:** క్రెడిట్ కార్డుదారులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. చేతిలో చిల్లి గవ్వ లేకపోయిన క్రెడిట్ కార్డు ఉంటేచాలు ఇష్టంవచ్చినట్లు కొనుగోలు చేసి బిల్లులు ఎగవేసిన వారికి అత్యున్నత న్యాయస్థానం గట్టి షాకిచ్చింది. బకాయిలు చెల్లింపులు ఆలస్యమైతే ఇక మీ ఇష్టం వచ్చినట్లు వడ్డీరేట్ల మోత మోగించుకోవచ్చునని బ్యాంకులకు సుప్రీంకోర్టు అనుమతినిచ్చింది. బిల్లులు చెల్లంచనివారిపై వడ్డీరేట్లు ఎంత విధించుకునేదానిపై బ్యాంకులదే తుది నిర్ణయమని కోర్టు స్పష్టంచేసింది. ఈ బకాయిలపై వడ్డీ పరిమితి ఉండాలన్న జాతీయ వినియోగదారుల పరిష్కార కమిషన్(ఎన్‌సీడీఆర్‌సీ) తీర్పును కోర్టు పక్కనపెట్టంది.

దీంతో నిర్ణీత గడువులోగా బిల్లు చెల్లించని వినియోగదారులపై పెద్దమొత్తంలో వడ్డీ వసూలు చేయడానికి బ్యాంకులకు మార్గం సుగమమైంది. క్రెడిట్ కార్డుల బిల్లుల ఆలస్య చెల్లింపులపై వార్షికంగా 30 శాతానికి మించి వడ్డీ వసూలుచేయరాదని 2008లో ఎన్‌సీఈడీఆర్‌సీ తీర్పు వెల్లడించింది. 16 ఏండ్ల క్రితం ఎన్‌సీఈడీఆర్‌సీ ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు తిరిగిరాసింది. జస్టిస్ బెలా త్రివేది, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ ప్రత్యేక బెంచ్ ఈ కేసును విచారించి ఈ తీర్పునిచ్చింది. స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్, సిటీ బ్యాంక్, అమెరికన్ ఎక్స్‌ప్రెస్, హెచ్‌ఎస్‌బీసీ వేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఈ ప్రత్యేక బెంచ్..క్రెడిట్ కార్డు బకాయిల ఆలస్య చెల్లింపులపై 30 శాతం నియంత్రణను ఎత్తివేస్తూ తీర్పును వెల్లడించింది.




### ఆవాజ్ ఫౌండేషన్ ఫిర్యాదు

క్రెడిట్ కార్డు బకాయిలపై ప్రధాన బ్యాంకులతో పాటు చిన్న బ్యాంకులు కూడా ఇష్టం వచ్చినట్లు వడ్డీరేట్లు వసూలు చేస్తున్నారని ఆవాజ్ ఫౌండేషన్ గతంలో ఎన్‌సీఈడీఆర్‌సీకి ఫిర్యాదు చేసింది. దీనిపై విచారించిన ఎన్‌సీఈడీఆర్‌సీ ప్రత్యేకంగా అన్ని బ్యాంకులు క్రెడిట్ కార్డు బకాయిలపై తమ వడ్డీని 30 శాతానికి మించకుండా వసూలు చేయాలని గతంలో తీర్పునిచ్చింది. దీనిపై దేశీయ, అంతర్జాతీయ బ్యాంకులు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ ఆలస్య చెల్లింపులపై గతంలో బ్యాంకులు 36 శాతం నుంచి 49 శాతం వరకు వడ్డీ వసూలు చేస్తుండేవి. అధిక వడ్డీ వసూలు చేస్తుండటంతో గతంలో క్రెడిట్ కార్డు బకాయిలు పూర్తిగా చెల్లింపులు జరపడం లేదా కనీస చెల్లింపులు జరిపేవారు తగ్గిపోయారు. క్రెడిట్ కార్డు లావాదేవీలపై 45 రోజుల వరకు ఎలాంటి వడ్డీని వసూలు చేయడం లేదని, కానీ కొందరు వీటిని అదనుగా చేసుకొని ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని బ్యాంకులు ఫిర్యాదు చేశాయి.

# ఈవీలపై 5 శాతం జీఎస్టీ
## యూస్డ్ ఈవీ కార్లపై 18 శాతం పన్ను.. జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయం

**జైసల్మేర్:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్టీ కౌన్సిల్ సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నది. ఎలక్ట్రిక్ వాహనాల వినిమయాన్ని పెంచడానికి ఈ వాహనాలపై 5 శాతం జీఎస్టీని విధిస్తూ నిర్ణయం తీసుకున్నది. అలాగే బిజినెస్ అవసరాలకోసం వినియోగించే యూస్డ్ కార్లపై పన్నును 12 శాతం నుంచి 18 శాతానికి పెంచిన కౌన్సిల్..విమాన ఇంధనం(జెట్ ఫ్యూయల్)ను జీఎస్టీ పరిధిలోకి తెచ్చే ప్రతిపాదనపై నిర్ణయాన్ని వాయిదా వేసింది. వన్‌నేషన్‌వన్‌ట్యాక్స్ అనే నినాదంతో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి పలు రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకించడంతో జెట్ ఫ్యూయల్‌పై జీఎస్టీ విధింపు ప్రతిపాదనను వెనక్కి తీసుకున్నది.

**బీమాపై నిర్ణయం వాయిదా**

బీమా ప్రీమియం వసూళ్లపై జీఎస్టీని తగ్గిస్తారని ఆశించినవారికి నిరాశే ఎదురైంది. ప్రస్తుత సమావేశంలో ఈ నిర్ణయాన్ని వాయిదా వేసింది. పన్ను తగ్గింపుపై ప్యానెల్ తుది నివేదిక సమర్పించకపోవడం వల్లనే వాయిదావేసింది. టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ ప్రీమియంపై జీఎస్టీని మినహాయింపు నివ్వాలని సూచించిన మంత్రుల బృందం.. సీనియర్ సిటిజన్ల ఆరోగ్య బీమా కవరేజ్‌పై కూడా పన్ను ఎత్తివేయాలని సూచించింది.

**జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాలు..**

- బలవర్ధకమైన బియ్యం గింజలపై 18 శాతం ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గింపు
- జన్యు చికిత్సలకు జీఎస్టీ మినహాయింపు
- రుణ గ్రహీతలపై బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు వేసే పెనాల్టీలపై జీఎస్టీ తొలగింపు
- పాప్‌కార్న్‌పై 18 శాతం జీఎస్టీ
- క్విక్ కామర్స్, ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫాంపై లెవీ ట్యాక్స్ విధింపుపై కౌన్సిల్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.
- రూ.2 వేల లోపు చెల్లింపులు చేసే పేమెంట్ అగ్రిగేటర్లకు జీఎస్టీ మినహాయింపు
- ప్రీప్యాక్డ్, స్పైస్ పాప్‌కార్న్‌లపై 12 శాతం పన్ను విధించిన కౌన్సిల్, అన్‌ప్యాక్ పాప్‌కార్న్‌పై 5 శాతం జీఎస్టీ
- ప్రస్తుతం క్రూడాయిల్, పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్, సహజ వాయువులను జీఎస్టీ పరిధిలో లేవు.



## గోల్డ్ ఎడిషన్‌గా ఓలా స్కూటర్

**న్యూఢిల్లీ:** ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్.. లిమిటెడ్ ఎడిషన్‌గా 24 క్యారెట్ బంగారంతో తయారైన ఎస్1 ప్రొ స్కూటర్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. 'సేవింగ్స్ వాలా స్కూటర్ కాన్‌యపెన్'లో భాగంగా విడుదల చేసిన సోనా ఎడిషన్‌గా స్కూటర్ కొన్ని మాడళ్లు మాత్రమే విక్రయించనున్నది. ఈ నెల 25న ఒకరోజు దేశవ్యాప్తంగా 4 వేల స్టోర్లను ప్రారంభించనున్న సంస్థ అందుకు తగ్గట్టుగానే ప్రణాళికలను వేగవంతం చేసింది.

# క్రీడా వార్తలు | SPORTS NEWS

## చాంపియన్స్ ట్రోఫీ సన్నాహాలు..
### పాక్‌కు ప్రత్యేక బృందాన్ని పంపిన ఐసీసీ

వచ్చే ఏడాది చాంపియన్స్ ట్రోఫీ వచ్చే ఏడాది పాక్ వేదికగా జరుగనున్నది. ఈ టోర్నీని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ICC) హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించేందుకు అంగీకారం తెలిపింది. ఈ క్రమంలో భద్రతా ఏర్పాట్లపై సమీక్షించేందుకు ఐసీసీ పాక్‌కు టీమ్‌ని పంపింది. అదే సమయంలో జనవరిలో జరుగనున్న ముక్కోణపు సిరీస్‌కు ముందు భద్రత, ఇతర ఏర్పాట్లను సమీక్షించేందుకు న్యూజిలాండ్ క్రికెట్ సైతం పాక్‌కు ఓ స్పెషల్ టీమ్‌ని పంపింది. పాకిస్తాన్‌తో పాటు న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా జట్లు ముక్కోణపు సిరీస్‌లో పాల్గొననున్నాయి. భద్రతా నిపుణుడు రెగ్ డికాసన్, న్యూజిలాండ్ ప్లేయర్స్ అసోసియేషన్ ప్రతినిధి బ్రాడ్ రోడెన్ న్యూజిలాండ్ జట్టులో ఉన్నారు. వారంతా కరాచీ, లాహోర్‌లో భద్రతా ఏర్పాట్లతో పాటు ఇతర సన్నాహకాలను సమీక్షించనున్నారు. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ ఆడే మ్యాచులన్నీ తటస్థ వేదికల్లో జరుగుతాయని ఐసీసీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఫిబ్రవరిలో జరిగే చాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్య హోదాలో పాక్‌తో పాటు యూఏఈలో భారత్ మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఈ మేరకు ఐసీసీ, పీసీబీ ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు ఫలవంతమయ్యాయి. హైబ్రిడ్ మోడల్‌కు ఓకే చెప్పిన పీసీబీ.. 2024 నుంచి 2027 వరకు జరిగే టోర్నీల్లో తాము కూడా భారత్‌లో పర్యటించమంటూ స్పష్టం చేయడంతో తటస్థ వేదికలపై నిర్వహణకు బీసీసీఐ సైతం అంగీకరించింది. ఈ క్రమంలో సన్నాహాలను సమీక్షించేందుకు ఐసీసీ పాక్‌కు ఒక బృందాన్ని పంపింది. ఐసీసీ బృందం లాహోర్, రావల్పిండికి వెళ్లే ముందు కరాచీలోని నేషనల్ స్టేడియాన్ని సందర్శించింది. ఏదైనా పెద్ద టోర్నమెంట్‌కు ఐసీసీ బృందాలను పంపుతాయని ఓ పీసీబీ అధికారి పేర్కొన్నారు. ఐసీసీతో పాటు న్యూజిలాండ్ జట్టు కరాచీ, లాహోర్, రావల్పిండిలోని స్టేడియం మరమ్మతు, పునరుద్ధరణ పనులపై సమీక్షించాయి. అయితే, చాంపియన్స్ ట్రోఫీ నేపథ్యంలో స్టేడియాలను సిద్ధం చేసేందుకు పీసీబీ రూ.12 బిలియన్సని ఖర్చు చేస్తున్నది.

## భారత్‌లో షూటింగ్ ప్రపంచకప్

**న్యూఢిల్లీ:** భారత్ వేదికగా వచ్చే ఏడాది ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ ప్రపంచకప్ టోర్నీ జరుగనుంది. ఈ విషయాన్ని జాతీయ రైఫిల్ సమాఖ్య(ఎన్ఆర్ఏఐ) శనివారం అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఇటీవలి సీనియర్ ప్రపంచకప్(2023), వరల్డ్‌కప్ ఫైనల్ తర్వాత భారత్‌లో జరుగనున్న మేజర్ అంతర్జాతీయ టోర్నీగా ఇది నిలువనుంది. దేశంలో షూటింగ్‌కు ఉన్న క్రేజ్, వసతి సౌకర్యాలు వరల్డ్‌కప్ ద్వారా మరింతగా ప్రాచుర్యంలోకి రానున్నాయి. మెగాటోర్నీకి సంబంధించి తేదీలు ఇంకా ఖరారు కాలేదు.

ISSF Junior World Cup




## కోయల్, నీలమ్‌కు రజతాలు

**దోహా:** ఆసియా యూత్, జూనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత లిఫ్టర్లు కోయల్ బార్, నీలమ్‌దేవి రజత పతకాలతో సత్తాచాటారు. శనివారం జరిగిన 55కిలోల యూత్ విభాగంలో బరిలోకి దిగిన కోయల్ స్నాచ్‌లో 79కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 103కిలోలతో మొత్తం 182కిలోలు ఎత్తి రెండో స్థానంలో నిలిచింది.

55కిలోల జూనియర్ విభాగంలో నీలమ్‌దేవి 190కి(స్నాచ్‌లో 86కి+క్లీన్ అండ్‌జర్క్‌లో 104కి) రజతాన్ని ఖాతాలో వేసుకుంది. వీరిద్దరి ప్రదర్శనతో టోర్నీలో భారత పతకాల సంఖ్య ఆరుకు చేరుకుంది. ఇప్పటికే 40కిలోల విభాగంలో జోష్న సాబర్ 135కిలోలతో కొత్త ఆసియా రికార్డును నెలకొల్పిన సంగతి తెలిసిందే.

## భారత్ X వెస్టిండీస్
### నేడు తొలి వన్డే పోరు



**వడోదరా:** భారత్, వెస్టిండీస్ మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు ఆదివారం తెరలేవనుంది. తాజాగా ముగిసిన టీ20 సిరీస్‌ను దక్కించుకున్న టీమ్ఇండియా మంచి జోరుమీదుండగా, వన్డే సిరీస్‌లో పుంజుకోవాలని విండీస్ పట్టుదలగా ఉంది. మధ్యకాలంలో వన్డేల్లో విండీస్‌పై భారత్‌దే ఆధిపత్యమైనా..కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్ ఫిట్‌నెస్ ఆందోళన కల్గిస్తున్నది. మోకాలి గాయం కారణంగా కౌర్..విండీస్‌తో చివరి రెండు టీ20లకు దూరమైన సంగతి తెలిసిందే. కౌర్ గైర్హాజరీలో స్మృతి మంధన సూపర్ ఫామ్‌తో అదరగొట్టింది. టీ20ల్లో ప్రదర్శనను వన్డేల్లోనూ కొనసాగించేందుకు మంధన సిద్ధంగా ఉన్నది. గత 10 వన్డేల్లో మంధన 60 సగటుతో 599 పరుగులు చేసింది. జెమీమా రోడ్రిగ్స్, రీచా ఘోష్‌తో భారత బ్యాటింగ్ బలంగా కనిపిస్తున్నది. మరోవైపు హిలీ మాథ్యూస్, దియోంద్ర డాటిన్, క్యాంప్‌బెల్ లాంటి స్టార్లతో కళకళలాడుతున్నది. తమదైన రోజున వీరు ప్రత్యర్థిపై విరుచుకుపడతారు. మ: 1.30 నుంచి స్పోర్ట్స్18లో




## అండర్ 19 ఆసియా మహిళల టీ20
# చాంపియన్‌గా భారత్

**కౌలాలంపూర్:** మహిళల అండర్19 ఆసియాకప్ టోర్నీలో యువ భారత్ అదరగొట్టింది. టోర్నీలో అపజయమెరుగని నిక్కీ ప్రసాద్ సారథ్యంలోని భారత జట్టు కౌలాలంపూర్‌లో జరిగిన ఫైనల్‌లో బంగ్లాదేశ్‌ను మట్టికరిపించింది. దీంతో ఆసియా క్రికెట్ కౌన్సిల్ తొలిసారిగా నిర్వహిస్తున్న టోర్నీని టీమ్ఇండియా సొంతం చేసుకున్నది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 117 పరుగులకు పరిమితమయింది. స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేకపోయిన బంగ్లా జట్టు 76 రన్స్‌కే ఆలౌట్ అయింది. దీంతో 41 రన్స్‌తో విజయం సాధించిన యువ భారత్ టోర్నీని విజేతగా నిలిచింది. టాస్ గెలిచిన బంగ్లాదేశ్.. భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. అయితే బ్యాటర్లు విఫలమవడంతో 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 117 రన్స్‌కే పరిమితమైంది. అయితే కష్టాల్లో ఉన్న జట్టును తెలంగాణ యువ కెరటం గొంగడి త్రిష మరోసారి ఆదుకుంది. 5 ఫోర్లు, రెండు సిక్సర్ల సాయంతో 41 బాల్స్‌లోనే 52 రన్స్ చేసి టాప్ స్కోరర్‌గా నిలిచింది. మరో బ్యాటర్ మైథిలి వినోద్ 12 బాల్స్‌లోనే 17 పరుగులు రాబట్టింది. ఇక చేజింగ్‌కు దిగిన బంగ్లా బ్యాటర్లు భారత బౌలర్లను ఎదుర్కొలేకపోయారు. దీంతో 18.3 ఓవర్లలో 76 రన్స్‌కే ఆలౌట్ అయ్యారు. ఆయుశి శుక్లా 3 వికెట్లు తీయగా, పరుణికా సిసోడియా 2 వికెట్లు పడగొట్టింది.



## ఉతప్పపై అరెస్ట్ వారెంట్

**బెంగళూరు:** భారత మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్పపై అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. తన సొంత కంపెనీ సెంటారస్ లైఫ్‌స్టయిల్ బ్రాండ్‌లో ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్(పీఎఫ్) నిధుల విషయంలో మోసానికి పాల్పడినట్లు తేలడంతో బెంగళూరు రిజీనల్ పీఎఫ్ కమిషనర్ గోపాలరెడ్డి..పులకేశి నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనకు చెందిన వస్త్ర కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులకు పీఎఫ్ కింద రూ.23,36,602 మొత్తం ఉతప్ప బకాయి పడ్డట్లు తేలింది. ఈ కారణంగా పీఎఫ్, మిసిలీనియస్ ప్రొవిజన్స్ యాక్ట్ 1952 కింద ఈ మాజీ క్రికెటర్‌పై అరెస్ట్ వారెంట్ నమోదైంది.



అయితే ఉతప్ప ప్రస్తుతం బెంగళూరులో ఉండటం లేదని దుబాయ్‌లో కుటుంబంతో నివసిస్తున్నట్లు తెలిసింది.

# మిస్ అయ్యాం..

తెలుగు సినిమా మూడో తరం ముచ్చట చిరంజీవి, బాలకృష్ణ. ఎనర్జీ లెవల్స్‌లో ఇద్దరూ ఇద్దరే! యాక్షన్‌లో ఒకరిని మించి మరొకరు రఫ్ఫాడించే బాపతు!! అడపాదడపా ఇంగ్లిష్ ఇయర్ ప్రారంభంలో వచ్చే సంక్రాంతికి ఇద్దరూ పోటాపోటీగా బరిలో దిగేవాళ్లు. ఎవరి సత్తా వాళ్లు చాటుకునేవాళ్లు. ప్రేక్షకులు పండుగ చేసుకునేవాళ్లు. 2023 సంక్రాంతికి కూడా 'వాల్తేరు వీరయ్య'గా చిరు అలరిస్తే, 'వీరసింహారెడ్డి'గా బాలయ్య బాబు రికార్డులు సృష్టించాడు. ఆ ఏడాది ఇద్దరూ చెరో రెండు సినిమాలు చేసి ప్రేక్షకులకు ఫీస్ట్ చేశారు. 'వాల్తేరు వీరయ్య'తో సూపర్ హిట్ తన ఖాతాలో వేసుకున్న మెగాస్టార్.. 'భోళా శంకర్'గా ప్రేక్షకులను పలకరించాడు. అయితే, 'భోళా..' భారీ పరాజయాన్ని మూటగట్టుకుంది.

'వీరసింహారెడ్డి'గా సంక్రాంతికి విజయం అందుకున్న బాలకృష్ణ 2023 ద్వితీయార్ధంలో 'భగవంత్ కేసరి'గా మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు. ఇలా ఇద్దరు పెద్ద హీరోలు రెండేసి సినిమాలు చేసి ఆ సంవత్సరాన్ని అపురూపంగా మార్చేశారు. ఎవరి దిష్టి తగిలిందో ఏమో కానీ, చిరు జోరుకు బ్రేకులు పడ్డాయి. మూడు నెలల్లో షూటింగ్ పూర్తిచేసే సంప్రదాయం పాటించే బాలకృష్ణ కూడా 2024పై శీతకన్ను వేశాడు. వారిద్దరి సినిమాలు ఈ ఏడాది సెట్స్‌కే పరిమితమయ్యాయి. దీంతో ఈ సంవత్సరం చిరు సందడి, బాలయ్య వీరంగం లేకుండా ప్రేక్షకులకు నిరాశే మిగిలింది.

కాలం విలువైనది. నిర్మాత మేలుకోరే నటులుగా పేరున్న చిరంజీవి, బాలకృష్ణకు ఇలా కాలాన్ని కర్పూరంలా కరిగించడం అస్సలు ఇష్టం ఉండదు. కానీ, అదే నిర్మాత క్షేమం కోసం, ఇండస్ట్రీ బాగు కోరి కాస్త లేట్‌గా అయినా లేటెస్ట్‌గా వద్దామని ఫిక్సయ్యారు. దాని ఫలితంగానే 2024లో ఈ ఇద్దరు హీరోల సినిమాలు ఒక్కటంటే ఒక్కటీ విడుదల కాలేదు. ఒక్కో సినిమా రెండేండ్ల పాటూ చిత్రీకరిస్తున్న ఈ రోజుల్లో ఏడాది గ్యాప్ రావడం పెద్ద విషయం కాదు. గతంలోనూ ఈ ఉభయ హీరోల సినిమాలు విడుదల కాని సంవత్సరాలు ఉన్నాయి. చిరంజీవి రాజకీయ రంగ ప్రవేశం తర్వాత దాదాపు తొమ్మిదేండ్లు సినిమాలకు దూరంగా ఉన్నాడు. రీఎంట్రీ తర్వాత వరుస ప్రాజెక్టులు ఒప్పుకోవడంతో.. మెగా అభిమానులు తెగ సంబురపడిపోయారు. అయితే, సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ బ్రేక్‌లు ఇస్తుండటంతో పెదవి విరుస్తున్నారు.

## 2025 దబిడి దిబిడే..


బాలకృష్ణ కథ ఓకే అన్న తర్వాత గరిష్ఠంగా ఆరు నెలల్లో సినిమా విడుదల కావడం ఖాయం. కానీ, ఈ ఏడాది ఆ సంప్రదాయానికి మంగళం పాడాడు బాలయ్య. 2024లో ఆయన సినిమాలు రెండు సెట్స్ మీద సందడి చేసినా.. తెర మీదికి మాత్రం రాలేదు. 2014 నుంచి 2019 వరకు ఏటా కనీసం ఒక్కటైనా బాలయ్య సినిమా విడుదలైంది. 2019లో అయితే ఏకంగా మూడు సినిమాలు ప్రేక్షకులను అలరించాయి. ఎన్టీఆర్ జీవిత చరిత్ర ఆధారంగా నిర్మించిన 'కథానాయకుడు', 'మహానాయకుడు' చిత్రాలతోపాటు ఆ ఏడాది 'రూలర్'గా అభిమానులను అలరించాడు. 2020లో బాలకృష్ణ నటించిన ఒక్క సినిమా కూడా విడుదల కాలేదు.

మళ్లీ 2021లో 'అఖండ' విజయం సొంతం చేసుకున్నా... 2022లో సెట్స్‌కే పరిమితమయ్యాడు. 2023లో జంట చిత్రాలతో హిట్లు సొంతం చేసుకున్నాడు. మళ్లీ 2024లో షూటింగ్ దశలోనే ఆగిపోయాడు. అయితే వచ్చే సంవత్సరం బాలకృష్ణ సినిమాలు రెండు, మూడు బాక్సాఫీస్ మీద దండయాత్ర చేయడం ఖాయంగా కనిపిస్తున్నది. బాబీ దర్శకత్వం వహించిన 'డాకూ మహారాజ్' రానున్న సంక్రాంతి రేసులో నిలిచింది. బోయపాటి కాంబోలో సిద్ధమవుతున్న 'అఖండ2' కూడా 2025లోనే రిలీజ్ కానుంది. అన్నీ కలిసొస్తే మరో చిత్రం కూడా 2025లో సత్తా చాటుతుందని ఇండస్ట్రీ టాక్.



## అక్కినేని వారూ అంతే..

సరైన హిట్ పడక అక్కినేని హీరోలు కాస్త వెనుకంజలో ఉన్నారు. ఈ ఏడాది సంక్రాంతికి నాగార్జున నటించిన 'నా సామిరంగ' విడుదలైంది. అయితే, ఆశించిన విజయం సాధించలేకపోయింది. రొటీన్ ఫార్ములాకు భిన్నంగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో నాగార్జున, ధనుష్ కాంబోలో రూపుదిద్దుకుంటున్న 'కుబేర' సినిమా డిసెంబర్ 31న విడుదలకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇక నాగ్ తనయులు నాగ చైతన్య, అఖిల్ సినిమాలు కూడా ఈ ఏడాది బాక్సాఫీస్ ముందుకు రాలేదు. నాగ చైతన్య, సాయి పల్లవి కాంబోలో రూపుదిద్దుకున్న 'తండేల్' ఈ ఏడాదిలోనే రావాల్సింది. అయితే, ఆ సినిమా విడుదల వాయిదా పడుతూ వచ్చింది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రిలీజ్ ఉంటుందని చిత్ర యూనిట్ ప్రకటించింది.



# కొత్త కథలకే ప్రాధాన్యం

'కెరీర్ విషయంలో చాలా హ్యాపీగా ఉన్నా. 'పొట్టేల్' సినిమాలో నా నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. ప్రస్తుతం కొత్తదనంతో కూడిన కథల్ని ఎంచుకుంటున్నా' అని చెప్పింది కథానాయిక అనన్య నాగళ్ల. ఆమె కీలక పాత్రలో నటించిన తాజా చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. వెన్నెల కిషోర్ టైటిల్ రోల్‌ని పోషించిన ఈ సినిమాకు రైటర్ మోహన్ దర్శకుడు. ఈ నెల 25న విడుదలకానుంది. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అనన్య నాగళ్ల మాట్లాడుతూ 'ఇప్పటివరకు నేను ఇలాంటి కథ వినలేదు. చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఇందులో నేను భ్రమరాంబ అనే పాత్రలో కనిపిస్తా. తన పాత్ర కథాగమనంలో కీలకంగా ఉంటుంది. ఆమె చుట్టూ నడిపించిన ప్రేమకథ కూడా ఆసక్తికరంగా అనిపిస్తుంది' అని తెలిపింది. 'వకీల్ సాబ్' సినిమా షూటింగ్ టైంలో పవన్‌కల్యాణ్ తన నటన చూసి మెచ్చుకున్నారని, ఎమోషన్స్‌ను బాగా పండించడంతో పాటు రియల్ పెయిన్ కనిపిస్తున్నదని చెప్పడం ఎంతో ఆనందాన్నిచ్చిందని అనన్య నాగళ్ల పేర్కొంది. ప్రస్తుతం తెలుగుతో పాటు హిందీలో ఓ ఫీమేల్ ఓరియెంటెడ్ సినిమా చేస్తున్నానని, కథాకళి, లేచింది మహిళా లోకం సినిమాలు త్వరలో రాబోతున్నాయని అనన్య నాగళ్ల చెప్పింది.






# 100 కోట్లు ఇచ్చినా చేయను

ఒకప్పటి అందాలతార అమీషా పటేల్‌కి కోపం వచ్చింది. 'గదర్ 2' దర్శకుడు అనిల్‌శర్మపై అంతెత్తు లేచింది. వివరాల్లోకెళ్తే. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో అనిల్‌శర్మ మాట్లాడుతూ 'గదర్ 2'లో అత్తగా నటించేందుకు అమీషా అంగీకరించలేదని, నర్గీస్ దత్ లాంటి మహానటీమణులు చిన్న వయసులోనే వృద్ధ పాత్రలు పోషించారని ఎంత నచ్చజెప్పినా.. ఆమె మాత్రం చేయను గాక చేయనన్నదని ఆయన వ్యాఖ్యానించారు. దీనిపై అమీషా వివరణ ఇస్తూ.. 'డియర్ అనిల్.. అది జీవితం కాదు. కేవలం సినిమా. కాబట్టి తెరపై నేను ఏం చేయాలి? ఏం చేయకూడదు అనేది పూర్తిగా నా వ్యక్తిగతం. 'గదర్' కోసమే కాదు, ఏ సినిమా కోసమైనా సరే.. అత్తయ్య పాత్రలు నేను చేయను. వందకోట్లు ఇచ్చినా అలాంటి పాత్రలకు అంగీకరించను. మీరంటే నాకెంతో గౌరవం. దాన్ని తగ్గించుకోవద్దు.' అంటూ ఘాటుగా స్పందించింది అమీషా.



## నాగసాధు పోరాటాలు



తమన్నా భాటియా ప్రధాన పాత్ర పోషిస్తున్న ప్రెస్టేజియస్ థ్రిల్లర్ 'ఓదెల 2'. మూడేళ్ల క్రితం వచ్చిన 'ఓదెల రైల్వే స్టేషన్' సినిమాకు సీక్వెల్‌గా రూపొందుతున్న ఈ చిత్రానికి అశోక్ తేజ దర్శకుడు. డి.మధు నిర్మాత. ఇందులో తమన్నా నాగసాధు పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. శనివారం ఆమె పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ నాగసాధు అవతారంలో ఉన్న తమన్నా తాజా పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్లో పుర్రెలపై ధైర్యంగా నడుస్తున్న తమన్నాను చూడొచ్చు. ఆకాశంలో ఎగురుతున్న రాబందులు ఈ పోస్టర్‌లో ప్రత్యేక ఆకర్షణ. ఈ సినిమాలో తమన్నాపై భారీ పోరాట సన్నివేశాలు కూడా ఉంటాయని, వాటికోసం ఆమె ప్రాపర్‌గా ట్రైనింగ్ కూడా తీసుకున్నదని, అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న ఈ చిత్రం అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వనున్నదని మేకర్స్ తెలిపారు. హెబ్బాపటేల్, వశిష్ట ఎన్.సింహ, యువ, నాగమహేశ్, వంశీ, గగనవిహారి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సౌందర్‌రాజన్.ఎస్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, సమర్పణ: సంపత్‌నంది, నిర్మాణం: మధు క్రియేషన్స్, సంపత్‌నంది టీమ్‌వర్క్స్.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com




ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ సత్తుమల్లేష్ ఆదివారం రాత్రి కలిశారు. బీసీల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

## ఘనంగా వెంకటస్వామి వర్ధంతి వేడుకలు



**ములుగు, మహా:** కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకట స్వామి వర్ధంతిని పురస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టరేట్ కార్యాలయంలో ఆదివారం అధికారి కంగా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కలెక్టరేట్ సూపర్ఇండెంట్ తహశీల్దార్ క్యాడర్ శ్రీనివాస్ కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామిచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు కేంద్ర మంత్రిగా, పార్లమెంటు సభ్యునిగా ప్రాతినిధ్యం వహించిన వెంకటస్వామి దళిత, బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఆయన సేవలను గుర్తిస్తూ నిరంతరం స్మరించుకునేలా ప్రభుత్వం అధికారికంగా జయంతి, వర్ధంతి వేడుకలను నిర్వహిస్తోందని అన్నారు. వర్ధంతి కార్యక్రమంలో కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## భూ భారతి పోర్టల్ ద్వారా ప్రజలకు మేలు

### కాంగ్రెస్ పార్టీ నాయకులు వరికుప్పల సుధాకర్



**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 21, మహా:** చెప్పినట్లే చేసిన ముఖ్యమంత్రి, ధరణి పోర్టల్ ను రద్దు చేస్తూ భూ భారతి పోర్టల్ ఏర్పాటు చేశారని వరికుప్పల సుధాకర్ అన్నారు. 2023 సార్వత్రిక ఎన్నికల ముందు, ఎన్నికల హామీలలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో విసిరేస్తామని నాటి తెలంగాణ పీసీసీ అధ్యక్షులు, నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటను విశ్వసించిన ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ధరణి పోర్టల్ పై కసరత్తు చేసి, ఎన్నికలలో ఇచ్చిన మాట ప్రకారం ధరణి పోర్టల్ ను రద్దు చేస్తూ, భూ భారతి పోర్టల్ ను ప్రజలకు సకల సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకొచ్చారని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వరికుప్పల సుధాకర్ తెలిపారు. ధరణి పోర్టల్ ద్వారా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని ఆయన అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతి పోర్టల్ ద్వారా ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని, పాస్ బుక్ లో ఏమైనా పొరపాట్లు జరిగినా, భూ పత్రాలలో ఏమైనా తప్పులు వచ్చినా వాటిని సరిదిద్దుకునే అవకాశం కల్పిస్తూ, భూ భద్రత కల్పిస్తూ పోర్టల్ తయారు చేయడం జరిగిందనీ, ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రికి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## కన్నుల పండువగా అయ్యప్ప ఆరట్టు ఉత్సవం

### శరణుఘోషతో పులకించిన గోదావరి తీరం..



**నిర్మల్ మహా:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే మొట్టమొదటి అయ్యప్ప ఆలయమైన నిర్మల్ జిల్లా సోన్ మండలం కడ్తాల్ గ్రామ శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో ఆదివారం నిర్వహించిన ఆరట్టు ఉత్సవం కన్నులపండువగా జరిగింది. ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, విశేష అలంకరణ చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఉంచి గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అయ్యప్ప భక్తుల సంకీర్తనలు, నృత్యాల మధ్య సోన్ గ్రామ సమీపంలోని గోదావరి నది తీరానికి పాదయాత్రగా పల్లకి సేవను తీసుకెళ్లారు. నదిలో స్వామివారికి వివిధ రకాల పువ్వులు, నదీజలం, పంచామృతంతో అభిషేకం చేసి ప్రత్యేక హారతినిచ్చారు. భక్తుల అయ్యప్పనామ శరణుఘోషతో గోదావరి తీరమంతా మార్మోగింది. అనంతరం ఆలయానికి చేరుకుని ఉంజల్ సేవ నిర్వహించారు. కౌట (బి) గ్రామానికి చెందిన ప్రభాకర్ రెడ్డి గురుస్వామి శిష్య బృందం ఆలపించిన అయ్యప్ప భక్తి గేయాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నదానం చేశారు. ఆరట్టు ఉత్సవం సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహానికి నిర్వహించిన వివిధ రకాల అభిషేకాలు భక్తులను నయనానందం కలిగించాయి. పవిత్ర గోదావరి జలం, వివిధ రకాల పుష్పాలు, పాలు, కొబ్బరి నీళ్లు, తేనె, చక్కెర, విభూతి, గంధంతో జరిగిన అభిషేకాలు, అయ్యప్పనామ సంకీర్తనలు, విశేషపూజల నడుమ భక్తులంతా తన్మయత్వం పొందారు.ఆలయ గురుస్వామి నర్సారెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ ఉత్సవంలో జిల్లా నుంచే కాకుండా వివిధ ప్రాంతాల భక్తుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## టీ తయారు చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన



**ములుగు, మహా:** జిల్లా కేంద్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె 13వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా ఆదివారం టీ తయారుచేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరసన తెలిపారు. గత సంవత్సరం రిలే నిరాహార దీక్షలు చేస్తున్న సమయంలో హనుమకొండలోని ఏకాశిల పార్కు యందు తమ దీక్ష శిబిరాన్ని సందర్శించిన అప్పటి టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు, నేటి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే సమగ్ర శిక్షా ఉద్యోగస్తులను రెగ్యులర్ చేస్తామని రాష్ట్ర నాయకులను భవన్ కు పిలిపించి టీ తాగే లోపు జీవో ఇచ్చి పంపిస్తా అని చెప్పిన తెలంగాణ ముఖ్యమంత్రి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ఉధృతంగా నిరవధిక సమ్మె కార్యక్రమాలు చేస్తున్నా స్పందించకపోవడం విడ్డూరమన్నారు. అత్యున్నత సుప్రీంకోర్టు న్యాయస్థానం ఇచ్చిన జియో ప్రకారం సమాన పనికి సమాన వేతనం తక్షణమే ఇవ్వాలన్నారు. అదేవిధంగా సమగ్ర శిక్ష ఉద్యోగస్తులందరినీ రెగ్యులర్ చేయాలని, తక్షణమే ఆరోగ్య భీమా, జీవిత భీమా, ప్రభుత్వ ఉద్యోగస్తులకు ఏ విధంగా పదవీ విరమణ బెనిఫిట్స్ ఇస్తున్నారో అదేవిధంగా సమగ్ర శిక్ష ఉద్యోగస్తులకు బెన్ఫిట్స్ ఇవ్వాలని, ఇప్పటివరకు విధుల నిర్వహణలో ఉండి రోడ్డు ప్రమాదాల్లో చనిపోయిన ఉద్యోగస్తులకు తక్షణమే ప్రభుత్వం స్పందించి రూ. 20 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు చల్లా భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమిడి కరుణాకర్, కోశాధికారి కుమార్ పాడియా, ఉపాధ్యక్షులు ఎండీ ఫిరోజ్, కార్యవర్గ సభ్యులు సుజాత, రమేష్ సమన్వయకర్తలు రాజేశ్వరి, ప్రవీణ్, చిరంజీవి, నీలంబాబు, రమేష్, వసంతరావు, సంజీవ గంగాధర్, సుబ్బారెడ్డి, కళ్యాణి, రవికుమార్, ఉమాదేవి, మమత, నరేష్, చందన, శారద, వనిత దితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలి

### రాష్ట్ర నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 21, మహా:** ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా ఎన్నికై బాధ్యతలు చేపట్టిన కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ మంకాల కరుణాకర్ ను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో రైతులకు కావాల్సిన సదుపాయాలను కల్పిస్తూ సహాయ సహకారాలు అందించాలని, మార్కెట్ అభివృద్ధికి చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఏనుగు రవీందర్ రెడ్డి, యువ నాయకులు భరత్ కుమార్ రెడ్డి, జంగారెడ్డి పాల్గొన్నారు.

## కాక వెంకటస్వామికి కాంగ్రెస్ శ్రేణుల ఘన నివాళులు



**మంచిర్యాల మహా :** కాక వెంకటస్వామి ప్రజల సంక్షేమం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహానేత అని ఆయన చేసిన సేవలు, ప్రజల కోసం అందించిన త్యాగాలు, ఎప్పటికీ ప్రజల గుండెల్లో నిలిచి ఉంటాయని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణం , రామకృష్ణాపూర్ లోని కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయం లో దివంగత కాక వెంకటస్వామి 10వ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. కాకా చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పేదల పాలిట పెన్నిధిగా బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా కాక వెంకటస్వామి తన జీవితాన్ని సర్వజన హితం కోసం అంకితం చేసారన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేసారు. ఆయరన సేవలను స్మరించి, ఆదర్శాలను నూతన తరాలకు తెలియజేయడం మనందరి బాధ్యత అన్నారు. సర్వజన హితం కోసం వారు చూపిన అంకితభావం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆయనను నిత్యం స్మరించుకుంటూ ఆయన సేవలను కొనసాగించడమే నిజమైన ఘన నివాళి అన్నారు.

## మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటానికి క్షీరాభిషేకం




**ములుగు, మహా:** నిరుద్యోగ కళాకారులను గత పాలకులు విస్మరించారని శాసనమండలిలో ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రస్తావించడం సంతోషకరమని, ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని నిరుద్యోగ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మోతె రమేష్ కోరారు. ఆదివారం ములుగులో అంబేద్కర్ విగ్రహం వద్ద మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ నిరుద్యోగ కళాకారులను గత పాలకులు విస్మరించారని, ప్రస్తుత ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అసలైన కళాకారులకు న్యాయం జరిగేలా చూడాలని రాష్ట్ర టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను కోరారు. ఈ క్షీరాభిషేకం కార్యక్రమంలో బత్తుల ఉపేందర్, పూలేపాక యాకయ్య, గద్దల రాజేందర్, మందపల్లి నవీన్, జేఏసీ జిల్లా నాయకులు ముంజల, బిక్షపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన గిడ్డంగి భావన నిర్మాణనికి శంకుస్థాపన

### ప్రజా పాలన ప్రభుత్వంలో రైతులకు పెద్దపీట

### మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మంకాల కరుణాకర్



**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 21, మహా:** రైతులకు మరింత అందుబాటులో ఉండేలా రాయపోలు గ్రామంలో నూతన గిడ్డంగి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో, దండుమైలారం పిఏసిఎస్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండలం రాయపోలు గ్రామంలో నూతన గిడ్డంగి భవన నిర్మాణానికి, పిఏసిఎస్ చైర్మన్ బిట్ల వెంకట్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మంకాల కరుణాకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ రైతు పక్ష పాతి అయిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో మరిన్ని నూతన ఆవిష్కరణలతో రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడం జరుగుతుందని, వ్యవసాయ రంగంలో భారతదేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడం జరుగుతుందని, ఈ ప్రజా ప్రభుత్వం మరింత కృషి చేస్తుందని, రైతులకు మరింత అందుబాటులోకి వ్యవసాయ ఎరువులు విత్తనాలు తీసుకురావడం జరుగుతుందనీ ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ వైస్ చైర్మన్ కంటేకార్ ఈశ్వర్, డైరెక్టర్లు జిలకాపల్లి ప్రభాకర్ రెడ్డి, దొండ యాదగిరి రెడ్డి, రాష్ట్ర సేవాదళ్ ఉపాధ్యక్షులు మంకాల దాసు, మాజీ సర్పంచ్ బల్వంత్ రెడ్డి, మాజి ఎంపీటీసీ దొండ విష్ణువర్ధన్ రెడ్డి, నర్సింహా, మైలారం యాదయ్య, పొలగోని శంకర్ గౌడ్, మాడాల శ్రీనివాస్ రెడ్డి, జెట్టి నర్సింగ్, పాశం నరసింహ, పూజారి మైసయ్య, మొలుగు నరసింహ, చెరుకు యాదయ్య, మొలుగు సంజీవ, గోదాల రాజిరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర మహా సభల పోస్టర్లు ఆవిష్కరణ




**ఆదిలాబాద్ మహా :** ఈనెల 28, 29 మరియు 30 తేదీలలో నల్గొండ పట్టణంలో జరిగే టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని టిఎస్ యూటీఎఫ్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె కిష్టన్న, వి అశోక్ పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని డైట్ కళాశాలలో మహాసభ పోస్టర్లను విడుదల చేశారు. ఈ మహాసభలకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. విద్యా సదస్సులో పాల్గొనేందుకు మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె నాగేశ్వర్, ప్రముఖ విశ్లేషకులు సంపాదకులు కె శ్రీనివాస్, జెఎన్యు నాయకురాలు అయిషి ఘోష్ తదితరులు పాల్గొంటున్నారని తెలిపారు. రాష్ట్ర మహాసభలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కే శ్రీనివాస్ కార్యదర్శులు శివన్న, గణేష్ మండలాల బాధ్యులు శంకర్, గంగాధర్, దిలీప్ ,శివన్న ,అశోక్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ములుగులో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

### హత్యగా అనుమానిస్తున్న పోలీసులు..?

### క్లూస్ టీంతో సోదాలు.. టిప్పర్ డ్రైవర్ గా పనిచేస్తున్నట్లు గుర్తింపు



**ములుగు, మహా:** ములుగులో వ్యక్తి అనుమానాస్పద మృతి మిస్టరీగా మారింది. పట్టణ శివారులోని బండారుపల్లి రోడ్డులోగల ఓ వెంచర్ లో వ్యక్తి మృతిచెంది ఉన్నాడని గేదెల కాపర్లు ఇచ్చిన సమాచారంతో ఆదివారం ఉదయం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహంపై రక్తం మరకలు ఉండటం, బండరాళ్లపై రక్తం మరకలు ఉండడంతో ఎవరో మర్డర్ చేసి ఉండొచ్చనే సందేహాన్ని వ్యక్తం చేస్తూ క్లూస్ టీంను పిలిపించారు. ములుగు ఇన్చార్జి సీఐ జి.రవీందర్, ఎస్సైలు వెంకటేశ్వర్ రావు, లక్ష్మారెడ్డిలు సమాచారం అందుకున్న మధ్యాహ్నం 12గంటల నుంచి రాత్రి 8గంటల వరకు సంఘటనా స్థలం పరిసరాల్లో సోదాలు నిర్వహించారు. డాగ్ స్క్వాడ్ తో విచారణ చేపట్టారు. మృతదేహం సమీపంలో మద్యం, కల్లు బాటిల్ లభించడంతో చనిపోయిన వ్యక్తితో పాటు మరొకరు ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుని జేబులో లభించిన ఆధారాలతో ఓర్సు శ్రీనివాస్ (40) గా, సొంతూరు మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంగా గుర్తించారు. డ్రైవింగ్ లైసెన్స్ దొరకడంతో పరిశీలించిన పోలీసులు భూపాలపల్లి జిల్లా రేగొండ మండలానికి చెందిన లింగారావు వద్ద ఇసుక కోసం టిప్పర్ డ్రైవర్ గా పనిచేస్తూ పనిచేస్తున్నాడు. మూడు రోజుల క్రితం డ్యూటీ దిగిన శ్రీనివాస్ ఇంటికి వెళ్తున్నానని చెప్పాడని ఓనర్ లింగారావు తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు. కాగా, శ్రీనివాస్ భార్యను పిలిపించిన పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుని తల్లి దండ్రులు వచ్చాకే పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు తెలిసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును ప్రారంభించారు.

## గణితంతోనే మానవ జీవితం

### అన్ని సబ్జెకులపై ప్రతిభాపరీక్షలు నిర్వహించాలి..ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ జి.రమేశ్




**ఎల్బీనగర్, డిసెంబర్ 22, మహా:** పిల్లలలో సృజనాత్మక వెలికితీయడానికి గణితం ఎంతో దోహపడుతుందని ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ జి. రమేశ్ అన్నారు. హయత్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్వీవైఎన్వీఎస్వీ సహకారంతో తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు రాష్ట్రసాయి గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాటాడుతూ... గణితంపై నిర్వహిసున్న ప్రతిభా పరీక్షలను విద్యార్థులకు అన్ని సబ్జెకులపై నిర్వహించాలన్నారు. గణితంలో ప్రతిభ చూపిన విద్యార్థి మిగిలిన అన్ని సబ్జెక్టులో ప్రతిభను చాటుతాడని తెలిపారు. ఎమ్మెల్సీ కూర రఘోతంరెడ్డి మాటాడుతూ... విద్యార్థులకు చిన్నప్పటి నుంచే గణితంపై అసకి కలిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. గణితంలో పట్టుసాధించే అన్నిరంగాలో సతా చాటుతారని తెలిపారు. గణితం నేర్చుకోవడం సులభమని, మానవ ఆర్థిక ప్రగతి గణితంపై అధారపడి ఉందని, ప్రతి ఒక్కరూ గణితంపై పటుసాధించాలని సూచించారు. రోడ్డు అభివృది కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి మాటాడుతూ.. ప్రతిభా పరీక్షలు విద్యార్థుల్లో భయాన్ని పోగోడుతాయన్నారు. విద్యారులకు గణితంపై అసక్తిని పెంపొందించడానికి, ఉపాధ్యాయుల కృషిని ప్రపంచానికి తెలిసేలా చేసేవే ప్రతిభా వేదికలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తాను ఎంపీపీగా ఉన్నప్పుడు హయత్నగర్ జడ్పీ స్కూల్ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని గుర్తుచేశారు. అనంతరం ప్రతిభా పోటీలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కందికొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామకృష, శ్రీనివాస్, సేవారత్న అవార్డు గ్రహీత నక్క శ్రీనివాస్ యాదవ్ తోపాటు వివిధ జిలాల గణితశాస్త్ర ఉపాధ్యాయులతోపాటు తదితరులు పాల్గొన్నారు.



## వివాహిత ఆత్మహత్య ఘటనలో ఐదుగురికి రిమాండ్

**ఆదిలాబాద్ మహా :** అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకుని బలవన్మరణానికి పాల్పడి ఘటనలో వన్ టౌన్ పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో ఈ కేసుకు సంబంధించిన వివరాలను సీఐ సునిల్ కుమార్ మీడియాకు వెల్లడించారు.భర్త, అత్తమామలు ఆడపడుచుల వేధింపులతో డిసెంబర్ 8న ఖానాపూర్ కు చెందిన తస్లీమా ఫిర్దోస్ యాసిడ్ తాగి ఆత్మహత్య చేసుకుంది. బాధితురాలి భర్త అబ్దుల్ మతీన్ ను డిసెంబర్ 9న అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. శుక్రవారం రోజున అత్తమామలు ఎంఏ. హకీం, ఇంతియాజ్ పర్వీన్, ఆడపడుచులు సమ్రీన్, అయేషా, అస్కియా, అంజుమ్ లను కామారెడ్డిలో అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

## బాల్య వివాహా రహిత సమాజంపై అవగాహన

**ఆదిలాబాద్ మహా :** బాల్యవివాహాలతో జీవితం అక్కడే ముగిసిపోతుందని మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ పవర్ యశోద అన్నారు. ఎస్సీ సంక్షేమ బాలికల వసతిగృహంలో ఆదివారం షూర్ ఎన్జీవో ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, బాల కార్మికుల నిర్మూలన కోసం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ఆడపిల్లల రక్షణ కోసం 1098, 100, మహిళల కోసం 181 హెల్ప్ లైన్ నెంబర్లు, షీ టీం సభ్యులు 24 గంటలపాటు పనిచేస్తున్నారని అన్నారు. ఆడపిల్లల కోసం ప్రత్యేక రక్షణ చట్టాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.చదువులు మధ్యలో మానివేయకుండా చదువును పూర్తి చేయాలన్నారు. బలవంతంగా పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు, బంధువులు ఎవరైనా ప్రయత్నించినా 1098 హెల్ప్ లైన్ నెంబర్ను సంప్రదించాలన్నారు. సఖి కేంద్రం కేస్ వర్కర్ నాగమణి మాట్లాడుతూ...సఖి ద్వారా కల్పిస్తున్న సేవలను తెలియజేశారు. షూర్ ఎన్జీవో రూపొందించిన బాల్య వివాహా రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేయించారు.

## స్కిల్ యూనివర్సిటీలో మరిన్ని కొత్త కోర్సులు..!

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో నిరుద్యోగ యవతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగస్తులకు తీర్చి దిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వంలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసింది. ఇందులో పలు కోర్సులో యువతకు ట్రైనింగ్ ఇస్తుంది. తొలి విడతగా వేర్ హౌస్ ఎగ్జిక్యూటివ్, కీ కన్సయినర్, ఫినిషింగ్ స్కిల్స్ ఇన్ నర్సింగ్ ఎక్స్ లెన్స్, ఫార్మా అసోసియేట్ ప్రోగ్రామ్ కోర్సులను స్టార్ట్ చేసి యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తుంది. రెండో విడతలో భాగంగా తాజాగా మరో నాలుగు కోర్సులను ప్రారంభించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. దీంతో మరికొంతమంది నిరుద్యోగ యువతకు మేలు జరగనున్నది. ఈ విషయం తెలిసి రాష్ట్ర యువత ప్రభుత్వాన్ని అభినందిస్తున్నారు.